ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
మహబూబాబాద్
ఆదివారం 3 నవంబరు 2024



ఆర్టీసీకి మహాలక్ష్మి



- పథకంతో సంస్థకు పెరిగిన ఆదాయం
- బస్సుల్లో అత్యధికంగా మహిళల ప్రయాణం
- మానుకోట, తొర్రూరు డిపోలకు అధిక రాబడి
- బతుకమ్మ సెలవులతో రీజియన్‌లోనే టాప్

మహబూబాబాద్ టౌన్, నవంబర్ 2 (ఆంధ్రజ్యోతి) : 'మహాలక్ష్మి' పథకం ఆర్టీసీకి వరంగా మారింది. ఆదాయం బాగా పెరిగింది. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటయ్యాక మహాలక్ష్మి పథకం అమలు చేస్తోండటంతో తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థకు అధిక ఆదాయం సమకూరింది. ప్రభుత్వం అమలు చేసే ఆరు గ్యారంటీల్లో భాగంగా మహాలక్ష్మి పథకం ద్వారా మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యాన్ని కల్పించారు. డిసెంబర్ 9న తెలంగాణ వ్యాప్తంగా మహాలక్ష్మి పథకాన్ని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రారంభించడంతో, మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించారు. నాటి నుంచి ఆర్టీసీ బస్సుల్లో మహిళా ప్రయాణికుల సంఖ్య పెరగడంతో తద్వారా సంస్థకు అదనపు ఆదాయం సమకూరుతోంది.

మహబూబాబాద్ జిల్లాలో తొర్రూరు, మానుకోట ఆర్టీసీ డిపోలున్నాయి. ఆయా డిపోల ద్వారా వివిధ రూట్లలో బస్సులు నడిపించి, ప్రయాణికులను గమ్యస్థానాలకు చేర్చుతున్నాయి. గతంలో అంటే డిసెంబరు 9 కంటే ముందు పరిశీలిస్తే మహాలక్ష్మి పథకం అమలు తర్వాత ప్రయాణికుల సంఖ్య పెరిగి ఆదాయం పెరుగుతూ వస్తోంది. ఉచిత ప్రయాణ సౌకర్యంతో ప్రైవేట్ వాహనాలు, రైళ్లను ఆశ్రయించకుండా ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణిస్తున్నారు. ఇక తెలంగాణ సంస్కృతి, సంప్రదాయ బతుకమ్మ పండుగ, సంక్రాంతి, ఇతరత్రా పర్వదినాల సమయంలో అదనంగా ఆదాయం వస్తోంది. ఇటీవల బతుకమ్మ, దసరా పండుగ రోజుల్లో అత్యధికంగా ప్రయాణికులను గమ్యస్థానాలకు చేర్చి అధిక ఆదాయం సమకూర్చడంలో వరంగల్ రీజియన్ పరిధిలో తొర్రూరు ప్రథమ స్థానంలో నిలవగా, మానుకోట డిపో ద్వితీయ స్థానంలో నిలిచాయి.

మానుకోట డిపో నుంచి ఇలా..

మహబూబాబాద్ జిల్లాలోని రెండు డిపోల పరిధిలోని బస్సుల్లో మహాలక్ష్మి పథకం అమలుకు ముందు రోజూ సుమారు 8 వేల మంది మహిళ ప్రయాణికులు రాకపోకలు కొనసాగించే వారు. మహాలక్ష్మి పథకంతో మహిళా ప్రయాణికుల సంఖ్య గణనీయంగా పెరిగింది. మహబూబాబాద్ డిపో పరిధిలో 63 బస్సులు ఉండగా, అందులో ఆర్టీసీ 39, హైయిర్‌విత్ 24 బస్సులు ఉన్నాయి. అవి హైదరాబాద్, వేములవాడ, భద్రాచలం, వరంగల్, ఖమ్మం, నర్సంపేట, తొర్రూరు, ఇల్లందు, కొత్తగూడ, సూర్యపేట, డోర్నకల్ రూట్లలో సర్వీస్‌లను నడుపుతున్నారు. గతంలో ప్రతీరోజు దాదాపు 10 వేల మంది ప్రయాణికులు ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించగా, తద్వారా డిపోకు రూ.8 నుంచి 9 లక్షల వరకు ఆదాయం సమకూరేది. మహాలక్ష్మి పథకం అమలుతో ప్రయాణికుల సంఖ్య పెరిగి రోజూ రూ.13 లక్షల నుంచి 14 లక్షల వరకు ఆదాయం సమకూరుతోంది. దీంతో డిపోకు అదనపు ఆదాయం వస్తోంది.

తొర్రూరు డిపో నుంచి ..

తొర్రూరు డిపోలో 94 బస్సులు ఉండగా, అందులో 49 ఆర్టీసీవి కాగా, మిగతావి హెయిర్‌విత్ 45 బస్సులు ఉన్నాయి. వాటిని ఖమ్మం, హైదరాబాద్, వరంగల్, మహబూబాబాద్, సూర్యాపేట, నిజామాబాద్, నర్సంపేట తదితర ప్రాంతాలకు సర్వీసులను నడిపిస్తున్నారు. ఆయా రూట్లలో గతంలో రోజూ 12 వేల మంది ప్రయాణించగా, రోజు రూ.10 నుంచి రూ.12 లక్షల ఆదాయం వచ్చేది. ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యంతో ప్రయాణికుల సంఖ్య పెరగడంతో ప్రతి దినం దాదాపుగా రూ.15 నుంచి రూ.16 లక్షల వరకు ఆదాయం సమకూరుతోంది. ఇలా మహాలక్ష్మి పథకంతో ఆర్టీసీ బస్సుల్లో మహిళా ప్రయాణికుల సంఖ్య పెరగడంతో ఆర్టీసీ వరంగా మారింది.

తద్వారా ఆర్టీసీ సంస్థకు ఆదాయం గణనీయంగా పెరిగి ,నష్టాలను అధిగమించి ఆర్టీసీ డిపోలు లాభాల బాటలో పయనిస్తున్నాయి.




సమష్టి కృషితో అదనపు ఆదాయం

ఎం.శివప్రసాద్, ఆర్టీసీ డిపో మేనేజర్, మానుకోట

కార్మికులు, అధికారులు, సిబ్బంది సమిష్టి కృషితోనే ఆర్టీసీ సంస్థకు అదనపు ఆదాయం సమకూరుతోంది. ఆర్టీసీ ప్రయాణం సురక్షితం. అందుకోసం బస్సుల్లో ప్రయాణించి సురక్షితంగా తమ తమ గమ్యస్థానాలకు చేరండి. ఆర్టీసీని ఆదరించి సంస్థ అభివృద్ధికి తోడ్పాడునందించాలి. వివాహాది, శుభకార్యాలయాలకు 10 శాతం రాయితీతో బస్సు సౌకర్యం కల్పిస్తున్నాం. ఈ సదవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి.

మహాలక్ష్మి పథకం తర్వాత నెలావారీగా మానుకోట డిపో ఆదాయం...

నెల	ఆదాయం	ప్రయాణికులు
డిసెంబరు (2023)	రూ.3.57 కోట్లు	8.07 లక్షలు
జనవరి (2024)	రూ.4.09 కోట్లు	10.17 లక్షలు
ఫిబ్రవరి (2024)	రూ.3.91 కోట్లు	9.55 లక్షలు
మార్చి (2024)	రూ.4.57 కోట్లు	11.13 లక్షలు
ఏప్రిల్ (2024)	రూ.4.15 కోట్లు	10.43 లక్షలు
మే (2024)	రూ.8.05 కోట్లు	20.00 లక్షలు
జూన్ (2024)	రూ.4.31 కోట్లు	10.50 లక్షలు
జూలై (2024)	రూ.3.08 కోట్లు	9.50 లక్షలు
ఆగస్టు (2024)	రూ.4.00 కోట్లు	10.00 లక్షలు
సెప్టెంబరు (2024)	రూ.3.50 కోట్లు	8.00 లక్షలు
అక్టోబరు (2024)	రూ.4.20 కోట్లు	10.00 లక్షలు



ఆ ఊరంతా నలభీములే

- వారు వండితే లొట్టలేసుకుంటూ లాగించాల్సిందే..
- ఒకే గ్రామం నుంచి సుమారు 100 మంది వంటవారు
- దాబాలు, రెస్టారెంట్లలో వారి చేతి రుచులే..
- ప్రత్యేకతను చాటుతున్న నేలపోగుల వంట మాస్టర్లు

7

ఆ ఊరుపేరు నేలపోగుల. జనగామ జిల్లా లింగాలఘణపురం మండలంలోని ఆ గ్రామానికి ఓ ప్రత్యేకత ఉంది. ఆ మారుమూల పల్లెలో సుమారు 100మంది నలభీములు ఉన్నారంటే ఆశ్చర్యం కలగక మానదు. శాకాహారం నుంచి మాంసాహారం వరకు అన్నిటిలోనూ వారిది అందెవేసిన చేయి. వారు వండారంటే చాలు ఎవరైనా లొట్టలేసుకుంటూ లాగించేయాల్సిందే. 35ఏళ్ల క్రితం ఒకరికి బతుకుదెరువు కోసం వంటపనులకు రోజువారీ కూలికి వెళ్లిన వారంతా ఇప్పుడు చేయితిరిగిన వంటవారిగా పేరుతెచ్చుకున్నారు. చుట్టుపక్కన జిల్లాలు, పట్టణాలే కాకుండా హైదరాబాద్ నుంచి వరంగల్ దాకా, సిద్దిపేట నుంచి సూర్యాపేట దాకా రహదారుల వెంట కనిపించే దాబాలు, రెస్టారెంట్లలో వారే వంట మాస్టర్లుగా పనిచేస్తున్నారు. సుమారు మూడున్నర దశాబ్దాలుగా తమ వంట రుచులను ఆహారప్రియులకు అందిస్తున్నారు.

- లింగాలఘణపురం



ఓ దాబాలో వంట చేస్తున్న నేలపోగులకు చెందిన చెఫ్ శ్రీనివాస్

వర్గీకరణ పేరుతో మాలమాదిగల మధ్యచిచ్చు

- మాలలు బానిసలు కాదు, రాజుల్లాగా బతికారు..
- తీర్పు చదవడం పూర్తవ్వక ముందే సీఎం ప్రకటన బాధాకరం
- జాతీయ మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు పిల్లి సుధాకర్



మహబూబాబాద్ అంబేద్కర్ సెంటర్‌లో మాట్లాడుతున్న జేఎంఎం రాష్ట్ర అధ్యక్షుడు పిల్లిసుధాకర్

మహబూబాబాద్ టౌన్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : ఎస్సీ వర్గీకరణ పేరుతో గ్రామాల్లో అన్నదమ్ముల్లా కలిసుండే మాలమాదిగల మధ్య పాలకులు చిచ్చు పెడుతున్నారని జాతీయ మాలమహానాడు (జేఎంఎం) రాష్ట్ర అధ్యక్షుడు పిల్లి సుధాకర్ ఆరోపించారు. వర్గీకరణపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును వ్యతిరేకిస్తూ జాతీయ మాలమహానాడు (జేఎంఎం)ఆధ్వర్యంలో అక్టోబరు 25న ప్రారంభమైన మాలల మహాపాదయాత్ర తొమ్మిదోరోజు శనివారం మహబూబాబాద్ జిల్లా కేంద్రానికి చేరుకుంది. మానుకోట పట్టణ శివార్లలో పాదయాత్ర బృందానికి ఘన స్వాగతం పలికారు. పాదయాత్ర బృందం స్థానిక ముత్యాలమ్మగుడి సెంటర్‌కు చేరుకుని తెలంగాణ అమరవీరుల స్థూపం వద్ద నివాళులర్పించారు. అనంతరం బీఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. ఈ సందర్భంగా జేఎంఎం రాష్ట్ర అధ్యక్షుడు, పాదయాత్ర బృందం సారధి పిల్లి సుధాకర్ మాట్లాడుతూ మాలలు బానిసలు కాదని, రాజులుగా బతికారని చెప్పారు. రాజ్యాధికారానికి చేరువవుతున్న దళితుల, మధ్య చిచ్చుపెట్టి వారిని రాజ్యాధికారానికి దూరం చేసే కుట్రలు జరుగుతున్నాయని చెప్పారు. మనువాదుల చేతిలో కీలుబొమ్మగా మారిన మందకృష్ణ మాదిగ భుజాలపై బీజేపీ ప్రభుత్వం తుపాకి పెట్టి మాలలను కాల్చే ప్రయత్నం చేస్తుందని దీనిని సహించేది లేదన్నారు.

సీఎం ప్రకటన ఎంత వరకు సమంజసం..

సుప్రీం కోర్టులో వర్గీకరణపై తీర్పు చదవకముందే రాష్ట్ర అసెంబ్లీలో సీఎం రేవంత్‌రెడ్డి వర్గీకరణపై ప్రకటన చేయడం ఎంతవరకు సమంజం కాదని పిల్లి సుధాకర్ మండి పడ్డారు. అన్ని రాజకీయ పార్టీలు ఒకవైపు ఉంటే మాలల వైపు ఉంది మహానీయుడు బీఆర్ అంబేద్కర్, భారత రాజ్యాంగం ఉందని చెప్పారు. గతంలో మాలలతో పెట్టుకున్న పాలకుల కుర్చీలు కదిలిపోయాయని గుర్తు చేశారు. పాదయాత్ర ముగింపు రోజు డిసెంబరు 1న హైదరాబాద్‌లో జరుపతలపెట్టిన మాలల మహాసంగ్రామ సభకు మాలలు పెద్దఎత్తున తరలి వచ్చి జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జాతీయ, రాష్ట్ర, జిల్లా నాయకులు బైరి రమేష్, అశోధ భాస్కర్, వెంకటస్వామి, బెజ్జం ఐలేష్, రమేష్‌చందర్, ప్రేమ్‌కుమార్, రమేష్, మహేష్, అశోక్, శ్రీనివాస్, రాంమూర్తి, భిక్షం, రాములు, వెంకన్న పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

మహబూబాబాద్ రూరల్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : జిల్లా కేంద్రంలోని పాతబజారులో పలు కాలనీల్లో ఆదివారం ఉదయం 8 గంటల నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు టౌన్-1 ఏఈసం గీత శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా కేంద్రంలోని పాతబజారులో నందినగర్, గుండ్లకుంట కాలనీ, ఆర్టీసీ కాలనీ, గిరిప్రసాద్‌నగర్, రావూరి నగర్, కంకరమిల్లు తండ, ఏటిగడ్డతండా, రాంచంద్రాపురం కాలనీ, ఆర్టీసీ బస్టాండ్ రోడ్డు, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, స్నేహనగర్, ఆకుల లక్ష్మయ్య కాలనీ, అంబేద్కర్ కాలనీ, ఈదులపూసపల్లి రోడ్డులలో చెట్ల కొమ్మల తొలగింపు కారణంగా విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు చెప్పారు. ఇందుకు విద్యుత్ వినియోగదారులు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.



కేసముద్రం స్టేషన్ హైస్కూల్లో కొనసాగుతున్న బాస్కెట్‌బాల్ పోటీలు

పట్టుదల ఉంటే ఏ రంగంలోనైనా

రాణిస్తారు

- రూ.2 కోట్లతో కేసముద్రం జడ్పీ హైస్కూల్ అభివృద్ధికి కృషి
- ఎంపీ బలరాంనాయక్
- అట్టహాసంగా రాష్ట్రస్థాయి బాస్కెట్‌బాల్ పోటీల ప్రారంభం

6

వడ్ల కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాలి

- ధాన్యానికి రూ.500 బోనస్
- వీసీలో పౌరసరఫరాల శాఖమంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి



వీసీలో పాల్గొన్న కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్

మహబూబాబాద్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : జిల్లాల్లో నిర్దేశించుకున్న ప్రణాళిక ప్రకారం ధాన్యం కొనుగోలు కేంద్రాలను వెంటనే ప్రారంభించాలని రాష్ట్ర పౌరసరఫరాల శాఖమంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఆదేశించారు. హైదరాబాద్ నుంచి మంత్రి రాష్ట్ర ఉన్నతాధికారులతో కలిసి అన్ని జిల్లాల కలెక్టర్లతో శనివారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ధాన్యం కొనుగోళ్లపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ధాన్యం కొనుగోలు ప్రక్రియ ప్రభుత్వానికి అత్యంత ప్రతిష్ఠాత్మకమని, ఏ చిన్న ఇబ్బంది లేకుండా సమర్థవంతగా ధాన్యం కొనుగోళ్లు జరిగేలా కలెక్టర్లు పర్యవేక్షించాలని సూచించారు. ప్రభుత్వం వేల కోట్లు ఖర్చుచేసి కొనుగోలు ప్రక్రియ చేపట్టిందని చెప్పారు. సన్నరకం ధాన్యం సాగు ప్రోత్సాహించేందుకు ప్రభుత్వం క్వింటాకు రూ.500 బోనస్ ప్రకటించిదని తెలిపారు. మహబూబాబాద్ జిల్లాలో రూపొందించుకున్న ప్రణాళిక ప్రకారం

మిగతా 8లో...

రూ. 2.50లక్షల గంజాయి పట్టివేత

8

రైతుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

- దళారుల చేతిలో రైతులు మోసపోవద్దు
- పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డి

పెద్దవంగర, నవంబర్2 (ఆంధ్రజ్యోతి) : రైతుల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్విని రెడ్డి అన్నారు. శనివారం పెద్దవంగరలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని తొర్రూరు పీఏసీఎస్ చైర్మన్ కాకిరాల హరిప్రసాద్ కలిసి ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ధాన్యం ఏ గ్రేడ్ రూ.2,320, బీ గ్రేడ్ రూ.2,300, సన్న రకానికి అదనంగా రూ.500 బోనస్ చెల్లిస్తామన్నారు. రైతులకు రూ.2 లక్షల రుణాలను ఏకకాలంలో మాఫీ చేసిన ఘనత సీఎం రేవంత్‌రెడ్డికే దక్కుతుందన్నారు. ధ్యానానికి మద్దతు ధర కల్పించేందుకు ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధ్యానం కొనుగోలు కేంద్రాలను వినియోగించుకోవాలని రైతులను కోరారు. రైతులు 17 శాతం తేమ ఉండేలా ధాన్యాన్ని ఆరబెట్టి తీసుకరావాలన్నారు. వడ్లను దళారులకు అమ్మి కర్షకులు మోసపోవద్దని సూచించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆరు గ్యారంటీలను అర్హులైన లబ్ధిదారులకు అందే విధంగా చూడాలని అధికారులను, ప్రజాప్రతినిధులను కోరారు. సీఎం రేవంత్‌రెడ్డి ప్రజలకు ఇచ్చిన ప్రతీ హామీని నెరవేరస్తారన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ మహేందర్, ఏవో స్వామినాయక్, పీఏసీఎస్ సీఈవో మురళి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు కేతిరెడ్డి నిరంజన్‌రెడ్డి, జాటోత్ నెహ్రూనాయక్, మండల అధ్యక్షుడు ముద్దసాని సురేష్, మురళి, శ్రీనివాస్, వెంకన్న, శ్యామ్, సీతారామ్‌నాయక్, గోపాల్, రవీందర్‌రెడ్డి, లింగమూర్తి, వేణు, రాజుయాదవ్, సోమన్న, రాములు, హరికృష్ణ, యాకన్న, ఉప్పలయ్య, సతీష్, సైదులు, సమ్మయ్య వినోద్, రామ్‌చరణ్ తదితరులు పాల్గొన్నారు.



పెద్దవంగరలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న మామిడాల యశస్వినిరెడ్డి

ప్రైవేట్ ఆస్పత్రుల్లో వైద్యాధికారుల తనిఖీలు



మానుకోటలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో తనిఖీలు చేస్తున్న వైద్యాధికారులు

నెహ్రూసెంటర్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని ప్రైవేట్ ఆస్పత్రులను తెలంగాణ క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్ యాక్ట్ ప్రకారం రిజిస్ట్రేషన్ చేసుకోవాలని మెటర్నల్ చైల్డ్ హెల్త్ ప్రోగ్రాం అధికారి సారంగం అన్నారు. జిల్లా కేంద్రంలోని పలు ప్రైవేట్ ఆస్పత్రులు, క్లినిక్, స్కానింగ్ సెంటర్లను శనివారం ఆకస్మీకంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆస్పత్రుల్లో అందించే సేవలకు తీసుకునే రుసుమును ప్రతీ ఆస్పత్రి ఆవరణలో అందరికి కనిపించే విధంగా సూచిక బోర్డును ప్రదర్శించాలన్నారు. ఆస్పత్రి ఆవరణం పరిశుభ్రంగా ఉండాలన్నారు. రోగులకు తగిన విధంగా సౌకర్యాలు కల్పించాలని, అవసరం ఉన్న వైద్య పరీక్షలు మాత్రమే నిర్వహించాలని, అనవసరమైన పరీక్షలు చేయకూడదని చెప్పారు. అనంతరం ఆస్పత్రిల్లోని రికార్డులను పరిశీలించారు. స్కానింగ్ సెంటర్ల నిర్వాహకులు గర్భస్థ లింగనిర్ధారణ పరీక్షలు చేయకూడదని హెచ్చరించారు. లింగ నిర్ధారణ చేస్తే పీసీ అండ్ పీఎన్‌డీటీ యాక్ట్ ప్రకారం. రూ.10 వేల జరిమానా, మూడేళ్ల జైలుశిక్ష ఉంటుందన్నారు. రెండోతప్పుకు ఐదేళ్ల జైలుశిక్ష, రూ.50 వేల జరిమానా ఉంటుందన్నారు. ఆయా స్కానింగ్ సెంటర్లలో డాక్టర్ పట్టా రద్దు చేయడం జరుగుతుందని చెప్పారు. చట్టవిరుద్ధమైన అబార్షన్‌లు నిర్వహిస్తే యాజమాన్యాలపై మెడికల్ టెర్మినేషన్ ఆఫ్ ప్రెగ్నేన్సీయాక్ట్ ప్రకారం. చర్యలు ఉంటాయని హెచ్చరించారు. కార్యక్రమంలో కె.ప్రసాద్, కెవి.రాజు, అరుణ్‌కుమార్ పాల్గొన్నారు.

ఓరుగల్లులో బీసీల ఐక్యత అద్భుతం

- బహిరంగ విచారణకు సంఘటితంగా వచ్చారు
- తెలంగాణ బీసీ కమిషన్ చైర్మన్ నిరంజన్ వెల్లడి
- హనుమకొండ కలెక్టరేట్‌లో విచారణ, వినతుల స్వీకరణ

హనుమకొండ / హనుమకొండ కలెక్టరేట్, నవంబర్ 2 (ఆంధ్రజ్యోతి) : ఓరుగల్లులో వెనుకబడిన తరగతుల వారిలో బీసీల ఐక్యత అద్భుతంగా ఉందని, బహిరంగ విచారణకు సంఘటితంగా వచ్చిన వారి చైతన్యం చూసి ముచ్చటేసిందని బీసీ కమిషన్ చైర్మన్ గోపిశెట్టి నిరంజన్ ప్రశంసించారు. రాష్ట్రంలో స్థానిక సంస్థలకు రిజర్వేషన్ల ఖరారు కోసం బహిరంగ విచారణ నిర్వహించేందుకు శనివారం వరంగల్‌కు వచ్చిన తెలంగాణ



సమావేశంలో మాట్లాడుతున్న బీసీ కమిషనర్ చైర్మన్ నిరంజన్


వినతిపత్రం అందజేస్తున్న బీసీ సంక్షేమ సంఘం నాయకులు

వెనుకబడిన తరగతుల కమిషన్ హనుమకొండ కలెక్టరేట్‌లో సమావేశమైంది. ఈ క్రమంలో చైర్మన్‌తో పాటు సభ్యులు రాపోలు జయప్రకాశ్, తిరుమలగిరి సురేందర్, బాలలక్ష్మిల బృందం ఉదయం నుంచి సాయంత్రం వరకు వివిధ కులసంఘాల నాయకుల నుంచి వినతి పత్రాలను స్వీకరించింది. అనంతరం విలేకరుల సమావేశంలో చైర్మన్ నిరంజన్ మాట్లాడుతూ ఇప్పటివరకు తాము ఐదు జిల్లాల్లో పర్యటించామని, అన్నిటి కన్నా ఉమ్మడి వరంగల్ జిల్లాలోని బీసీల నుంచే సమస్యలపై పిటిషన్లు వెల్లువలా వచ్చాయని, వివిధ కులాల వారు కొత్త సమస్యలను తమ దృష్టికి తెచ్చారన్నారు. ఏ జిల్లాలో రాని విధంగా ఉమ్మడి వరంగల్ జిల్లా నుంచి 231 పిటిషన్లు అందాయని.. వీటిలో హనుమకొండ జిల్లానుంచి అత్యధికంగా 88, వరంగల్ నుంచి 55, జనగామ నుంచి 27, మహబూబాబాద్ 26, జయశంకర్ భూపాలపల్లి నుంచి 28, ములుగు నుంచి 7 వచ్చాయని వివరించారు. బీసీలకు న్యాయం జరిగేలా చూడడమే బీసీ కమిషన్ లక్ష్యమని, బీసీ సంఘాల వారు నివేదించిన సమస్యలను పరిశీలించి సిఫార్సులను ప్రభుత్వానికి చేరవేస్తామని అన్నారు. బీసీ కమిషన్ సభ్యులు రాపోలు జయప్రకాశ్, తిరుమలగిరి సురేందర్, బాలలక్ష్మి మాట్లాడుతూ సామాజిక, ఆర్థిక, విద్య, ఉద్యోగ, ఉపాధి రాజకీయ సర్వేలో ప్రతీ ఒక్కరు పాల్గొనాలని, సర్వే ఆధారంగానే భవిష్యత్ ఆధారపడి ఉంటుందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా వివిధ జిల్లాల్లో దామాషాపై ప్రజాభిప్రాయ సేకరణకు బీసీ కమిషన్ బహిరంగ విచారణ చేపట్టిందని వివరించారు. సామాజిక, సర్వే కోసం ఎన్యుమరేటర్లు వచ్చినప్పుడు ప్రజలు సరైన సమాచారం ఇవ్వాలన్నారు. ఇచ్చే సమాచారం ఆధారంగానే ప్రభుత్వ ఫలాలు అందుతాయని చెప్పారు. హనుమకొండ కలెక్టర్ ప్రావీణ్య మాట్లాడుతూ ఉమ్మడి జిల్లాకు సంబంధించి 200 టోకెన్లను అందజేశామని, బీసీ కమిషన్‌కు వివిధ కుల సంఘాలు, ప్రజలు తమ అభిప్రాయాలు, విజ్ఞప్తులను అందించేందుకు తగిన ఏర్పాట్లు చేశామన్నారు. వరంగల్ కలెక్టర్ డాక్టర్ సత్యశారద మాట్లాడుతూ బీసీ కమిషన్ బృందానికి వరంగల్ జిల్లాకు సంబంధించిన వివిధ కుల సంఘాల ప్రతినిధులు, ప్రజలు తమ అభిప్రాయాలను తెలిపారని, విజ్ఞప్తులను అందించారని పేర్కొన్నారు. ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి, ఎమ్మెల్సీ నర్సిరెడ్డి, ఆరు జిల్లాల కలెక్టర్లు బీసీ సంక్షేమ శాఖల అధికారులతో పాటు తదితర ప్రజా ప్రతినిధులు కూడా కమిషన్ విచారణకు హాజరయ్యారు. వివిధ బీసీ సంఘాల నేతతో సమావేశం హాలు కిక్కిరిసి పోయింది. తమకు మాట్లాడే అవకాశం ఇవ్వనందుకు కొందరు కుల సంఘాల నాయకులు అసంతృప్తి చేశారు. వాగ్వాదానికి దిగారు. కమిషన్ విచారణ ముగిసిన తర్వాత కూడా ఇంకా అనేకమంది పిటిషన్లు ఇవ్వడానికి ఎగబడగా.. కమిషన్ సభ్యులు వాటన్నిటినీ స్వీకరించారు.

కమిషన్ దృష్టికి పలు ప్రధాన డిమాండ్లు...

ఉమ్మడి వరంగల్ జిల్లాకు చెందిన వివిధ బీసీ కుల సంఘాల నాయకులకు టోకెన్లు కేటాయించి టోకెన్ నెంబర్ ఆధారంగా ఆ సంఘం నాయకున్ని పిలిచి వారి సూచనలు తీసుకున్నారు. ఈ క్రమంలో వివిధ కుల సంఘాల ప్రతినిధులతో పాటు రాజకీయ పార్టీల ప్రతినిధులు తమ విజ్ఞప్తులను అందించారు. బీసీల ఏబీసీడీ గ్రూపులను పునఃవర్గీకరణ చేయాలని, కొన్ని కులాల గ్రూపును కూడా మార్చాలన్న డిమాండ్లు వచ్చాయి. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42శాతం రిజర్వేషన్ కల్పిస్తూ జనాభా దామాషా మేరకు రిజర్వేషన్లను అమలు చేయాలని, అలాగే రాజకీయాల్లో ప్రాతినిధ్యం లేని కులాలకు కూడా ఎన్నికల్లో పోటీ చేసేందుకు వీలుగా రిజర్వేషన్లు కల్పించాలని విన్నవించారు. ఇక బీసీ కులాల వారిపై జరుగుతున్న అన్యాయాలు, అత్యాచారాలను నిరోధించేందుకు బీసీ అట్రాసిటీ చట్టాన్ని తీసుకురావాలని కోరారు. బీసీల్లోని కొన్ని కులాల వారు తమను ఎస్సీ ఎస్టీలుగా మార్చాలని కోరారు. దూదేకుల వారు తమను బీసీ డినుంచి ఈ గా, సగరవారు డి నుంచి ఏ గా, ముదిరాజ్‌లు డి నుంచి ఏ కి, వడ్డెరలు ఏ నుంచి ఎస్సీలోకి, పూసల వారు ఎంబీసీలోకి, గాండ్లవారు బీసీ ఈ నుంచి ఏకి మార్చాలని కోరుతూ వినతిపత్రాలను సమర్పించారు. కుల నిర్మూలన సంఘం వారు నో క్యాస్ట్, నో రిలీజియన్ సర్టిఫికెట్లు జారీ చేయాలని, ఏ కులం, ఏ మతానికి చెందనివారికి 5 శాతం రిజర్వేషన్లు కల్పించాలని కోరారు. పద్మశాలి సంఘం వారు టెక్స్‌టైల్ పార్క్‌ను ఏర్పాటు చేసుకునేందుకు మహబూబాబాద్‌లో ప్రభుత్వం నిర్ణయించిన ధరకు 200 ఎకరాలు ఇవ్వాలని కోరారు.

భద్రకాళి ఆలయ సందర్శన

అంతకుముందు చైర్మన్ సహా కమిషన్ సభ్యులు భద్రకాళి దేవాలయాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు చేశారు. బహిరంగ విచారణ ఒక బృహత్తర కార్యక్రమమని, విచారణ ప్రారంభానికి ముందు అమ్మవారిని దర్శించుకోవడం వల్ల ఆటంకాలు తొలగిపోతాయన్నారు. అమ్మవారు శాంతరూపంలో తమకు దర్శనమిచ్చారని, ఆటంకాలు కలిగించే వారిని ఉగ్రరూపంలో అడ్డుకుంటారన్నారు.

స్వాగతం పలికిన కలెక్టర్లు

తొలుత హైదరాబాద్ నుంచి హనుమకొండ కలెక్టరేట్‌కు శనివారం ఉదయం 10:40గంటలకు చేరుకున్న బీసీ కమిషన్ చైర్మన్ నిరంజన్ బృందానికి కలెక్టర్లు ఘన స్వాగతం పలికారు. హనుమకొండ, వరంగల్, ములుగు, జనగామ కలెక్టర్లు ప్రావీణ్య, సత్య శారదదేవి, దివాకర, రిజ్వాన్ బాషా పూలమొక్కలను అందించారు.

సమస్యలు చెప్పిన వెంటనే.. బీసీ హాస్టల్ సందర్శన

బీసీ సంక్షేమ హాస్టళ్లలో కనీస సౌకర్యాలు లేక తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని, లేడీస్ హాస్టళ్లు మరీ అధ్వానంగా ఉన్నాయని బీసీ కమిషన్‌కు వినతిపత్రం అందింది. వెంటనే స్పందించిన చైర్మన్ నిరంజన్ బహిరంగ విచారణ అనంతరం హనుమకొండ బాలసముద్రంలోని బీసీ బాలికల హాస్టల్‌ను కమిషన్ సభ్యులతో కలిసి సందర్శించారు. హాస్టల్‌లోని విద్యార్థులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. హాస్టళ్లలోని అసౌకర్యాలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళతామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ కమిషన్ కులసంఘాల నుంచి వినతులను తీసుకోవడమే కాకుండా విచారణలో భాగంగా క్షేత్ర స్థాయిలో సమస్యలను కూడా స్వయంగా అధ్యయనం చేస్తోందన్నారు.

ఆర్థిక ఇబ్బందులతో రైతు ఆత్మహత్య

- మహబూబాబాద్ మండలం రెడ్యాలలో ఘటన


వెంకన్న (ఫైల్)

మహబూబాబాద్ రూరల్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : ఆర్థిక ఇబ్బందులతో గడ్డిమందు తాగి రైతు ఆత్మహత్య చేసుకున్న ఘటన మహబూబాబాద్ మండలం రెడ్యాలలో శనివారం చోటు చేసుకుంది. రూరల్ ఎస్సై దీపికరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం. రెడ్యాల గ్రామానికి చెందిన పిడుగు వెంకన్న (45)కు నాలుగు ఎకరాల వ్యవసాయ భూమి ఉంది. అందులో వివిధ పంటలను సాగు చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఇటీవల కుటుంబ అవసరాల నిమిత్తం రూ.1.50 లక్షలను అప్పు చేసినట్లు చెప్పారు. అవి ఎలా తీర్చాలనే మనస్తాపంతో గతనెల 31న రాత్రి 12 గంటల ప్రాంతంలో కుటుంబసభ్యులు నిద్రిస్తున్న సమయంలో ఇంట్లో ఉన్న గడ్డిమందు తాగాడు. గమనించిన అతని భార్య హుటాహుటిన కుటుంబసభ్యులతో కలిసి వెంకన్నను జిల్లా ఆస్పత్రికి తరలించారు. వెంకన్న ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన వైద్యం కోసం ఖమ్మంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శనివారం ఉదయం 7 గంటల ప్రాంతంలో వెంకన్న మృతి చెందాడు. మృతుడికి భార్య యాకమ్మ, ఇద్దరు కుమారులు శ్రీకాంత్, ప్రవీణ్ ఉన్నారు. మృతుడి కుమారుడు శ్రీకాంత్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై దీపికరెడ్డి తెలిపారు.

సబ్‌జైలును తనిఖీ చేసిన జడ్జి విక్రమ్

జనగామ రూరల్, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): జనగామ సబ్ జైలును శనివారం సీనియర్ సివిల్ జడ్జి సి.విక్రమ్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఖైదీలకు భోజనం, వారి ఆరోగ్య సమస్యలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఖైదీలు సత్ప్రవర్తనతో ఉండాలని, చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని కోరారు. జైలు సూపరింటెండెంట్ కృష్ణకాంత్ పాల్గొన్నారు.


ఖైదీలతో మాట్లాడుతున్న జడ్జి విక్రమ్

జీడికల్ బ్రహ్మోత్సవాలకు ఏర్పాట్లు : కలెక్టర్


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్, ఎమ్మెల్యే

జనగామ రూరల్, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): జీడికల్ బ్రహ్మోత్సవాలకు ఘనంగా ఏర్పాట్లు చేయాలని జనగామ కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా ఆదేశించారు. లింగాలఘనపురం మండలం జీడికల్‌లో నిర్వహించే బ్రహ్మోత్సవాల ఏర్పాట్లపై శనివారం కలెక్టరేట్‌లో కలెక్టర్, అదనపు కలెక్టర్లతో కలిసి స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి, సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ బ్రహ్మోత్సవాల ఏర్పాట్లను పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. జనగామ, యాదగిరిగుట్ట నుంచి జీడికల్ వెళ్లేందుకు భక్తులకు ఆర్టీసీ బస్ సౌకర్యం కల్పిస్తామన్నారు. భక్తులకు మౌలిక వసతులు కల్పించాలన్నారు. అనంతరం ఎమ్మెల్యే కడియం మాట్లాడుతూ నవంబరు 14 నుంచి 25 వరకు బ్రహ్మోత్సవాలను నిర్వహిస్తామని తెలిపారు. నిరంతరం విద్యుత్ సరఫరా, పోలీస్ కంట్రోల్ రూం, వైద్య శిబిరాలు, 108 వాహనం ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామన్నారు. సమావేశంలో ఆర్డీవో గోపిరాం, స్టేషన్‌ఘన్‌పూర్ ఏసీపీ భీంశర్మ, అధికారులు పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సులు లేక ఇబ్బందులు

- అన్నారం, చెట్లముప్పారానికి లేని దైన్య స్థితి
- వరంగల్, మహబూబాబాద్‌కు పెరగాల్సిన సర్వీసులు

ఇనుగుర్తి (మహబూబాబాద్), నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : నూతనంగా ఆవిర్భవించిన ఇనుగుర్తి మండల కేంద్రం నుంచి వివిధ ప్రాంతాలకు సరైన ఆర్టీసీ బస్సు సర్వీసులు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. కేసముద్రం, నెల్లికుదురు, వరంగల్ జిల్లా నెక్కొండ మండలాల మధ్యన ఉండే ఈ మండలానికి అన్నివైపులా రోడ్ల అనుసంధానం ఉన్నప్పటికీ సరైన బస్సు సర్వీసులు లేవు. మూడు మండలాలతో పాటు జిల్లా కేంద్రమైన మహబూబాబాద్, తొర్రూరు, వరంగల్, హైదరాబాద్ ప్రాంతాలకు నిత్యం ప్రజలు రాకపోకలు సాగిస్తుంటారు. ఈ నేపథ్యంలో ఉదయం, సాయంత్రం ఒకటి చొప్పున బస్సు సర్వీసులు మినహా రవాణా సౌకర్యం లేక ప్రయాణికులు ప్రైవేటు వాహనాలను ఆశ్రయించాల్సివస్తోంది. ఉదయం 6 గంటలకు మహబూబాబాద్ నుంచి కేసముద్రం, ఇనుగుర్తి మీదుగా తొర్రూరు, హైదరాబాద్‌కు ఇదే సమయానికి నాగారం నుంచి ఇనుగుర్తి మీదుగా నెక్కొండ, వరంగల్‌కు ఒకటి చొప్పున బస్సు సర్వీసు ఉంది. నెల్లికుదురు మోడల్ స్కూల్ విద్యార్థుల కోసం ఉదయం 8.30కు తొర్రూరు నుంచి నెల్లికుదురు, ఇనుగుర్తి, బొడ్లాడకు, సాయంత్రం 6 గంటలకు ఇదే మార్గంలో తిరిగి వెళ్లే సర్వీసు ఒకటి నడుస్తోంది. ఇక 9.30 ఇనుగుర్తి, కేసముద్రం మీదుగా మహబూబాబాద్, ఇదే బస్సు మధ్యాహ్నం 2 గంటలకు ఇనుగుర్తికి చేరి ఇక్కడి నుంచి నాగారం వరకు వెళ్లి తిరిగి ఇనుగుర్తి మీదుగా వరంగల్‌కు వెళుతుంది. సాయంత్రం 5 గంటలకు హైదరాబాద్ నుంచి ఇనుగుర్తి మీదుగా కేసముద్రం, మహబూబాబాద్‌కు వెళుతుంది.

అవసరమైన బస్సు సర్వీసులివే..

వరంగల్ జిల్లా పర్వతగిరి మండలం పుణ్యక్షేత్రమైన అన్నారం షరీఫ్‌కు ఇనుగుర్తికి కేవలం 11 కిలోమీటర్ల దూరం ఉంటుంది. అన్నారం షరీఫ్‌కు ఇనుగుర్తి, మేచరాజుపల్లి మీదుగా కేసముద్రం, మహబూబాబాద్ ప్రాంతాల నుంచి ప్రతీ శుక్రవారం వందల సంఖ్యలో భక్తులు వెళుతుంటారు. కేసముద్రం, మహబూబాబాద్ వైపు నుంచి ఇనుగుర్తి మీదుగా మేచరాజుపల్లి అన్నారం షరీఫ్‌కు ఉదయం, సాయంత్రం ఒక బస్సు సర్వీసు అవసరం ఉంది. అలాగే ఇనుగుర్తి నుంచి చెట్లముప్పారం, ఆలేరు మీదుగా మహబూబాబాద్ మార్గంలో బస్సు అసలే లేకపోవడంతో పూర్తిగా ప్రైవేటు వాహనాలపైనే రాకపోకలు కొనసాగుతున్నాయి. ఇక వరంగల్‌కు ఉదయం 6, మధ్యాహ్నం 2 గంటలకు, మహబూబాబాద్‌కు 9.30, సాయంత్రం 5 గంటలకు సర్వీసులు మినహా ఇతర వేళల్లో ఆయా పట్టణాలకు బస్సు సర్వీసులు లేవు. ప్రజాప్రతినిధుల, అధికారులు స్పందించి ఇనుగుర్తి మీదుగా బస్సు సర్వీసులను పెంచాలని పలువురు కోరుతున్నారు.


ఇనుగుర్తి ఆర్టీసీ బస్సు

రాహుల్‌గాంధీ ప్రధాని అయితే బీసీలకు న్యాయం

ప్రభుత్వ విప్, డోర్నకల్ ఎమ్మెల్యే జాటోతు రాంచందర్‌నాయక్


మహబూబాబాద్‌లో కులగణనపై అఖిలపక్ష సమావేశంలో మాట్లాడుతున్న జాటోతు రాంచందర్‌నాయక్

మహబూబాబాద్ టౌన్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : ఏఐసీసీ పూర్వ అధ్యక్షుడు రాహుల్‌గాంధీ ప్రధాని అయితే బడుగు, బలహీన వర్గాలకు మరింత న్యాయం జరుగుతుందని రాష్ట్రప్రభుత్వ విప్, డోర్నకల్ ఎమ్మెల్యే జాటోతు రాంచందర్‌నాయక్ అన్నారు. భారత్ జోడో యాత్రతో దేశ వ్యాప్తంగా ప్రజల ఆర్థిక స్థితిగతులను రాహుల్‌గాంధీ తెలుసుకున్నారని జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్లు కల్పించి అన్ని వర్గాలకు న్యాయం చేయాలన్న లక్ష్యంతో బీసీ కులగణనకు శ్రీకారం చుట్టారని అది కూడా తెలంగాణ నుంచే ఆరంభమవుతుందని చెప్పారు. మహబూబాబాద్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శనివారం కులగణనపై కాంగ్రెస్ అర్బన్ అధ్యక్షుడు ఘనపురపు అంజయ్య అధ్యక్షతన అఖిల పక్ష సమావేశాన్ని నిర్వహించారు. వివిధ రాజకీయ పార్టీలు, కుల సంఘాల ప్రతినిధులు తమ అభిప్రాయాలను వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ కులగణన విజయవంతానికి కాంగ్రెస్ కార్యకర్తలు తన వంతు సహకారాన్ని అందించాలని సూచించారు. హైదరాబాద్ భవిష్యత్ కోసమే హైడ్రా అని, తాగునీటి ఇబ్బందులు తలెత్తవద్దని భూగర్భజలాల పెంపుదల కోసమే చెరువుల పరిరక్షణ అని చెప్పారు.

కులగణనకు ప్రతీ ఒక్కరు సహకరించాలి

- మానుకోట ఎమ్మెల్యే మురళీనాయక్


గ్రామాలు, పట్టణాల్లో ఈనెల 6 నుంచి జరిగే కులగణనకు ప్రతీ ఒక్కరు సహకరించాలని మానుకోట ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్ అన్నారు. కులగణనపై అపోహలు వద్దని ఖచ్చితంగా జరిగి తీరుతుందన్నారు. 2014 లో మాజీ సీఎం కేసీఆర్ సమగ్ర కుటుంబ సర్వే (ఎస్‌కేఎస్) నిర్వహించినప్పటికి బీసీ లెక్కలు బయట పెట్టేందుకు భయపడ్డారని విమర్శించారు. ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కులగణన చేసిన తర్వాతనే జనాభా ప్రాతిపదికను రిజర్వేషన్లు ఇచ్చి స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహిస్తామని చెప్పిన దమ్మున్న నాయకుడని చెప్పారు. డీసీసీ అధ్యక్షుడు జెన్నారెడ్డి భరత్‌చందర్‌రెడ్డి, అర్బన్ అధ్యక్షుడు ఘనపురపు అంజయ్య, కేసముద్రం మార్కెట్ చైర్మన్ గంట సంజీవరెడ్డి, తొర్రూరు మార్కెట్ వైస్ చైర్మన్ భట్టు నాయక్, వివిధ పార్టీలు, కుల సంఘాలు, కాంగ్రెస్ పార్టీ నాయకులు గుగులోతు దస్రూ నాయక్, నీరుటి లక్ష్మీనారాయణ, అల్లం నాగేశ్వర్ రావు, బండారు వెంకన్న, ఎడ్ల రమేష్, ఖలీల్‌పాషా, ఎక్బాల్, అబ్దుల్ లతీఫ్, వేముల వెంకన్న, పెరుగుకుమార్, సమ్మెట రాజమౌళి, పోతురాజు రాజు, భూక్య శ్రీను, స్వర్ణలత, విజయలక్ష్మి, గోగుల మల్లయ్య, చిట్టి వెంకటేశ్వర్లు, అశోక్‌గౌడ్, నీరుటి సురేష్ నాయుడు, గుగులోతు రవినాయక్, గునిగంటి కమలాకర్, తాళ్లపల్లి జగన్, సిరిపురం వీరన్న తదితరులు పాల్గొన్నారు.

పట్టుదల ఉంటే ఏ రంగంలోనైనా రాణిస్తారు

- రూ. 2 కోట్లతో కేసముద్రం జడ్పీ హైస్కూల్ అభివృద్ధికి కృషి
- మహబూబాబాద్ ఎంపీ బలరాంనాయక్
- అట్టహాసంగా రాష్ట్ర స్థాయి బాస్కెట్ బాల్ పోటీలు ప్రారంభం



బాస్కెట్‌బాల్ పోటీల ప్రారంభోత్సవంలో మాట్లాడుతున్న ఎంపీ బలరాంనాయక్


కేసముద్రం స్టేషన్ హైస్కూల్లో కొనసాగుతున్న బాస్కెట్‌బాల్ పోటీలు

కేసముద్రం, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : పట్టుదల ఉంటే ఏరంగంలోనైనా రాణిస్తారని, విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ నైపుణ్యం సాధించాలని మహబూబాబాద్ ఎంపీ బలరాంనాయక్ పేర్కొన్నారు. కేసముద్రం హైస్కూల్లో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్‌జీఎఫ్) తెలంగాణ మహబూబాబాద్ జిల్లా ఆర్గనైజింగ్ కమిటీ ఆధ్వర్యంలో మూడు రోజులపాటు నిర్వహిస్తున్న రాష్ట్రస్థాయి బాస్కెట్‌బాల్, పూమా పోటీలను శనివారం రాత్రి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ కేసముద్రం స్టేషన్ జడ్పీ హైస్కూల్ అభివృద్ధి కోసం రూ.2కోట్ల నిధులను మంజూరు చేయించేందుకు కృషి చేస్తానని, ఎమ్మెల్యేతో కలిసి సీఎం రేవంత్‌రెడ్డి చొరవతో నిధులను మంజూరు చేయిస్తానన్నారు. ఎంపీ నిధుల్లోంచి ఇక్కడ షటిల్ కోర్టును కూడా వేయిస్తానని తెలిపారు. ఎమ్మెల్యే డాక్టర్ భూక్య మురళీనాయక్ మాట్లాడుతూ క్రీడలతో శారీరక ధృఢత్వంతోపాటు మానసిక స్థైర్యం అలవడుతుందని, తాను ఫుట్‌బాల్ క్రీడాకారున్ని కావడంతోనే ఎన్నికల ప్రచారంలో ఉదయం 8 నుంచి రాత్రి 9 గంటల వరకు ఇంటింటికీ ప్రచారం నిర్వహించగలిగానన్నారు. ఆటల్లో గెలుపోటములను సమానంగా తీసుకోవాలని, ఓడిన వారే పాఠాలు నేర్చుకుంటారన్నారు. ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్‌రావు మాట్లాడుతూ బాల్యం నుంచే ఏదో ఒక రంగంలో నైపుణ్యం సాధించిన వారే భవిష్యత్తులో ఉన్నత శిఖరాలు అధిరోహిస్తారన్నారు. పట్టుదలతో అందివచ్చిన అవకాశాలన్నిటిని వినియోగించుకొని ఎదగాలని సూచించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ గంట సంజీవరెడ్డి, డీసీసీ అధ్యక్షుడు భరత్‌చందర్‌రెడ్డి, డీవైఎస్‌వో జ్యోతి, హెచ్‌ఎంలు బందెల రాజు, బండారు నరేందర్, రూరల్ సీఐ సర్వయ్య క్రీడా నిర్వాహకులు రావుల మురళి, కొమ్ము రాజేందర్, కొప్పుల శంకర్ పాల్గొన్నారు. ఇక ఈ పోటీల ప్రారంభోత్సవం సందర్భంగా నర్సంపేట కళానిధిక్షేత్రానికి చెందిన కూచిపూడి విద్యార్థినులు, కల్వల హైస్కూల్ విద్యార్థినిల నృత్యాలు, మరిపెడ సాంఘిక సంక్షేమ పాఠశాల విద్యార్థుల బ్యాండ్ మ్యూజిక్, వివిధ జిల్లా జట్లు నిర్వహించిన మార్చ్ ఫాస్ట్ అలరించాయి. ఈ క్రీడలకు పది ఉమ్మడి జిల్లాల నుంచి బాస్కెట్‌బాల్, పూమా 17, 19 ఏళ్ల విభాగాల్లో 20 చొప్పున 60 జట్లకు చెందిన 720 మంది క్రీడాకారులు హాజరయ్యారు.

కార్తీకం.. ఆరంభం

• వేయిస్తంభాల ఆలయంలో భక్తుల పూజలు .. రుద్రేశ్వరుడికి లక్ష పుష్పార్చన •

హనుమకొండ చౌరస్తా, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): శివవిష్ణువులకు ప్రీతికరమైన కార్తీక మాసం ఆరంభమైంది. తొలిరోజైన శనివారం ఉమ్మడి జిల్లాలోని పలు శైవక్షేత్రాలు, ఆలయాలు ఆధ్యాత్మిక సందడిని సంతరించుకున్నాయి. ముఖ్యంగా హనుమకొండలోని చారిత్రక వేయిస్తంభాల రుద్రేశ్వరస్వామి దేవాలయంలో కార్తీక మాసాన్ని పురస్కరించుకొని ఆలయ ప్రధాన అర్చకుడు గంగు ఉపేంద్రశర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. శనివారం వేయిస్తంభాల ఆలయంలో ఏర్పాటు చేసిన కార్తీక మాస వేడుకలను పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ముందుగా జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. అనంతరం కుటుంబసభ్యులతో కలిసి రుద్రేశ్వరుడికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. శివవిష్ణువులకు ప్రీతికరమైన ఈ మాసంలో రుద్రేశ్వరుడికి పూజలు నిర్వహించడం ద్వారా విశేష ఫలం లభిస్తుందన్నారు. మహిళలు సామూహికంగా దీపోత్సవాలు, పూజలు, ధాత్రినారాయణ కల్యాణ ఉత్సవాలు ఉసిరిక పూజలు, దీపాలు, అన్నదానాలు, వస్త్రదానాలు చేయడం అనవాయితీగా వస్తోందన్నారు. ఆలయ ప్రధాన అర్చకుడు గంగు ఉపేంద్రశర్మ మాట్లాడుతూ కార్తీక మాసం సందర్భంగా ఉదయం నాలుగు గంటలకు సుప్రభాత సేవతో ఉత్తిష్ట గణపతికి హరిగ్రామం కుంకుమ అలంకరణ నిర్వహించిన అనంతరం శ్రీరుద్రేశ్వరస్వామికి మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకాన్ని అర్చక బృందం నిర్వహించిందన్నారు. అదే విధంగా స్వామి వారికి ఐదురకాల పుష్పాలు


రుద్రేశ్వరుడికి ప్రత్యేక పుజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి దంపతులు

లిల్లీ, బంతి, చామంతి, గులాబీ, మల్లె పుష్పాలను విజయవాడ నుంచి తెప్పించి కన్నుల పండగా పుష్పార్చనను నిర్వహించామన్నారు. అనంతరం భక్తులు సామూహికంగా అభిషేకాలు, నిర్వహించారు. కాగా, ఆలయంలో సరైన వసతులు లేవని భక్తులు ఎమ్మెల్యేకు ఫిర్యాదు చేశారు. దీంతో ఈవో తీరు పట్ల అగ్రహం వ్యక్తం చేసిన ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి.. రాష్ట్ర దేవాదాయ కమిషనర్‌తో ఫోన్‌లో మాట్లాడి భక్తులకు అసౌకర్యాలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. అనంతరం తగిన వసతులు కల్పించాలని ఈవోను ఎమ్మెల్యే ఆదేశించారు. ఇదిలా వుండగా, కార్తీక మాసం తొలిరోజు కావడంతో ఉదయం నుంచి సాయంత్రం వరకు భక్తులు పెద్దసంఖ్యలో ఆలయానికి తరలివచ్చి స్వామి వారిని దర్శించుకొని పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అర్చకులు సందీప్‌శర్మ, మణికంఠశర్మ, సేవకులు ప్రసాద్, కాశీవిశ్వనాథచారి, ఆలయ సిబ్బంది మధుకర్, రామకృష్ణ, సుజాత పాల్గొన్నారు.


కాళేశ్వరాలయ ప్రాంగణంలో వత్తులు కాలుస్తున్న భక్తులు


ధ్వజస్తంభం వద్ద దీపాలంకరణ వెలిగిస్తున్న అర్చకులు

కాళేశ్వరంలో భక్తుల సందడి

మహదేవపూర్, నవంబరు 2: జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలం కాళేశ్వర క్షేత్రం కార్తీక సందడిని సంతరించుకుంది. కార్తీక మాసం తొలి రోజైన శనివారం ఆలయానికి తరలొచ్చిన భక్తులు తొలుత గోదావరిలో స్నానం ఆచరించి స్వామి వారి సన్నిధికి చేరుకున్నారు. శ్రీ కాళేశ్వర ముక్తీశ్వర స్వామికి అభిషేకాలు, రుద్రాభిషేకాలు, అర్చనలు చేశారు. అనంతరం శుభానందదేవి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు ఇబ్బందులు కలగకుండా ఆలయ నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు. భక్తులకు ప్రమిదలు, తైలం అందజేశారు. ఉసిరి చెట్టు వద్ద భక్తులు వత్తులు కాల్చారు. ఉసిరి చెట్టు, తులసి చెట్టు వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఘనంగా ఆకాశదీపం

కార్తీక మాసం సందర్భంగా నెలరోజుల పాటు ధ్వజస్తంభానికి ఆకాశ దీపాన్ని వెలిగించడం ఆనవాయితీ. శనివారం నుంచి రోజూ 108 దీపాల అలంకరణ కార్యక్రమం కాళేశ్వరంలో నిర్వహించనున్నారు. ఆలయ సూపరింటెండెంట్ బుర్రి శ్రీనివాస్, మాజీ సర్పంచ్ మెంగాని మాధవి, గ్రామస్థులు, అర్చకులు పాల్గొన్నారు.

అభిరుచి



ఆ ఊరంతా నలభీములే

లింగాలఘణపురం, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): రుచికరమైన వంటకాల్లో వాళ్లది అందెవేసిన చేయి.. నోరూరించే పసందైన భోజనాల తయారీలో వాళ్లకు మరెవరూ సాటి రారు.. చికెన్ బిర్యానీ.. మటన్ బిర్యానీ.. చికెన్ టిక్కా.. తందూరి చికెన్.. జింజర్ చికెన్.. బటర్‌చికెన్.. చికెన్ కోలాపూరి.. చికెన్‌మసాల ఇలా ఏది వండి నా లొట్టలేసుకునే తినాల్సిందే. హైద్రాబాద్ నుంచి వరంగల్ దాకా, సిద్దిపేట నుంచి సూర్యాపేట దాకా రహదారుల వెంట దాబా ఉందంటే అక్కడ ఖచ్చి తంగా నేలపోగులకు చెందిన వంట మాస్టర్ ఉండా ల్సిందే. లింగాలఘణపురం మండలంలోని మారు మూల పల్లె నేలపోగుల గ్రామం ప్రత్యేకత. నిరుపేద లకు, నిరుద్యోగులకు నిలయం. బతుకుదెరువు కోసం వంటల తయారీ వైపు దృష్టిని సారించారు. వంద మం ది దాకా నలభీములుగా(వంటల మాస్టార్లు) మారా రు. ప్రత్యేకతను చాటుతున్న నేలపోగుల గ్రామ వంటకాలపై ఆంధ్రజ్యోతి సండే స్పెషల్.

• రుచికరమైన వంటల్లో వారికి లేరుసాటి..
• దాబా, రెస్టారెంట్లలో ఆ గ్రామ మాస్టర్ల రుచులే..
• ప్రత్యేకతను చాటుతున్న నేలపోగుల వంట మాస్టర్లు

మూడున్నర దశాబ్దాల పయనం..

జనగామ జిల్లా నిరుపేదలకు నిలయంగా ఉండేది. పెరుగుతున్న కుటుంబ భారం.. పిల్లల చదువులు.. వృద్ధ తల్లిదండ్రుల పోషణ ఇలా అనేక రకాల బాధ్యత లు నేలపోగుల గ్రామస్థులను కుదుపేస్తున్న క్రమంలో దినసరి కూలీగా వంటకాలు చేయడం వైపు దృష్టి సారించారు. 35ఏళ్ల క్రితం ఒకరికి మరొకరు సాయం గా ఒకరి తర్వాత ఇంకొకరు వంటకాలను తయారు చేస్తూ యువకులు నలభీములుగా ఆరితేరారు. మొద ట్లో హైద్రాబాద్, వరంగల్‌లాంటి పట్టణాల్లో పెద్దపెద్ద హోటళ్లలో వంటల మాస్టార్లుగా పనిచేశారు. ఆతర్వాత స్వయంగా ఉపాధి మార్గాలను అన్వేషించుకుంటూ సొంతంగా దాబాలను ఏర్పాటు చేసుకుని ఆర్థిక స్థిర త్వాన్ని సాధించే దిశగా పయనిస్తున్నారు. ఇప్పుడు హైద్రాబాద్- వరంగల్ జాతీయ రహదారిపై జనగామ జిల్లా కేంద్రంలో రకరకాల రుచికరమైన వంటకాలతో భోజనప్రియులను ఆకట్టుకునే దాబాలన్నీ నేలపోగుల గ్రామానికి చెందిన మూలాలే అత్యధికం.


దాబాలో చపాతీ కాలుస్తున్న చెఫ్

నోరూరించాల్సిందే..

గాజులు లేని వంట గమ్మత్తయిన వంట అన్నట్లుగా నేలపోగుల చెందిన అనేక మంది వంటల మాస్టార్లు వంటకాలు తయారుచేయడంలో మహిళలను తలద న్నేస్తున్నారు. ఇంట్లో తయారుచేసుకున్నట్లుగానే తెలం గాణ చికెన్, ఆంధ్రా చికెన్ ఇలా ప్రాంతాల వారిగా వినియోగదారులకు ఇష్టమైన రీతి లో తయారు చేసే వంటలు చేస్తే అక్కడు న్న వ్యక్తులు ఎప్పుడెప్పుడా అంటూ లొట్ట లు వేయాల్సిందే. ఒక్కసారి నేలపోగులకు చెందిన చేతివంటకాలు రుచి చూస్తే మళ్లీ మళ్లీ తినాలనిపించడమే వీరి ప్రత్యేకత.

విందు కార్యక్రమాల్లో వంటలు..

రుచికరమైన వంటలు తయారు చేయడంలో ప్రావీణ్యతను సాధించిన నేలపోగుల వంటల మాస్టార్లు కేవలం దాబాల్లోనే కాకుండా విందు కార్యక్రమాలకు ఆర్డర్‌పై వంటలను తయారు చేసేందుకు మొబైల్ సర్వీస్ కూడా చేస్తున్నారు. పెద్ద పెద్ద



ఫంక్షన్లలో వంట లు చేసేందుకు కొందరు తమ పరివారంతో బయలు దేరి ఉపాధి పొందడంలోనూ నేలపోగుల నలభీములు భోజనప్రియులతో వారెవ్వా అనిపించుకుంటున్నారు.

33 ఏళ్ల నుంచి వంటలు చేస్తున్నా..

- తేరాల శ్రీనివాస్, నేలపోగుల



మాది పేదరిక కుటుంబం. నేను పెద్దగా చదువుకోలేదు. 33ఏళ్ల క్రితం హన్మకొండలోని ఓ హోటల్‌లో పనిచేసేందుకు ఊరి నుంచి బయలుదేరాను. అక్కడే వంట మాస్టార్‌గా నైపుణ్యతను సాధించాను. ఆ తర్వాత స్వయంగా దాబా పెట్టాలనే ఆలోచన వచ్చింది. ప్రస్తుతం జనగామ జిల్లా కేంద్రంలో దాబాను నడిపిస్తున్నాను. 33 ఏళ్ల నుంచి ఇదే వృత్తిలో ఉంటూ ప్రస్తుతం ఆర్థికంగా ఉన్నత స్థితికి చేరుకున్నాను. నేలపోగుల నుంచి ఎంతో మంది వంటకాన్నే ఉపాధిగా మార్చుకోవడం ఆనందంగా ఉంది.

ఇక నుంచి పుష్‌పుల్ మరో ట్రిప్పు

» పునః ప్రారంభమైన మధ్యాహ్నం రైలు » ప్రతీ రోజు 1.45 గంటల కు వరంగల్ నుంచి పయనం



గిర్మాజిపేట, నవంబరు2 (ఆంధ్రజ్యోతి): పేదల రైలుగా పేరు గడించిన వరంగల్-హైదరాబాద్ పుష్‌పుల్ రైలు రెండేళ్ల తరువాత మధ్యాహ్నం ట్రిప్పు తిరిగి అందు బాటులోకి వచ్చింది. కరోనాకు ముందు వరంగల్ నుంచి ఉదయం, మధ్యాహ్నం హైదరాబాద్‌కు నడిచేది. కరోనా లాక్‌డౌన్‌తో 2021 నుంచి పుష్‌పుల్ రైలు నిలిచిపోయింది. కరోనా తరువాత అన్ని రైళ్లు యథా విధిగా మొదలైనప్పటికీ పుష్‌పుల్ రైలు నడవలేదు. దీంతో పేద, మధ్య తరగతి ప్రజలు అనేక ఇబ్బందులు పడ్డారు. ఈ సమస్యపై 'ఆంధ్రజ్యోతి' పలు వార్తా కథనాలు ప్రచురించింది. దీంతో స్పందించిన ఉన్నతాధికారులు కేవలం మధ్యాహ్నం మాత్రమే 2022 జూలై 25న ప్రారం భించి కొద్ది కాలం నడిపి నిలిపివేశారు. అయితే కాజీపేట నుంచి మాత్రం ప్రతీ రోజు ఉదయం వేళ మాత్రం హైదరాబాద్‌కు నడుస్తోంది.

24 నెలల తరువాత..

వరంగల్ నుంచి మధ్యాహ్నం నడిచిన పుష్‌పుల్ రైలును 2022 అక్టోబర్‌లో రైల్వే అధికారులు నిలిపివే శారు. అప్పటి నుంచి వరంగల్ ప్రజలు అనేక వ్యయప్రయాసలకు ఓర్చి కాకతీయ, గోల్కొండ, శాతావాహన, గోదావరి తదితర ఎక్స్‌ప్రెస్, సూపర్ ఫాస్ట్ రైళ్లలో హైదరాబాద్‌కు వెళ్తున్నారు. ఈ విషయంపై గత ఆగస్టు 31న 'ఆంధ్రజ్యోతి' మరో కథనం ప్రచురించింది. దీంతో రైల్వే ఉన్నత అధికారులు స్పందించి ఎట్టకేలకు శనివారం మధ్యాహ్నం వరంగల్ నుంచి పుష్‌పుల్ రైలును తిరిగి ప్రారంభించారు. ఈ రైలు ప్రతీ రోజు మధ్యాహ్నం వరంగల్ నుంచి 1.45 గంటలకు బయలుదేరి మధ్యాహ్నం 2.10 గంటలకు కాజీపేటకు చేరుకుని అక్కడి నుంచి 2.15 గంటలకు హైదరాబాద్‌కు బయలుదేరుతుంది. అయితే ప్రజలకు ఈ సమాచారం లేకపోవడంతో శనివారం మధ్యాహ్నం ప్రయాణికులు తక్కువగానే వచ్చారు. పుష్‌పుల్ టికెట్ వరంగల్ నుంచి సికింద్రాబాద్‌కు రూ.35 ఉండగా హైదరాబాద్‌కు రూ.40 ఉంది. కాగా, ప్రస్తుతం ఉదయం కాజీపేట నుంచి హైదరాబాద్ నడుస్తున్న పుష్‌పుల్ రైలును గతంలో మాదిరిగా వరంగల్ నుంచి నడిపించాలని, ఈ దిశగా రైల్వే ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని వరంగల్ ప్రజలు కోరుతున్నారు.

ప్రకటనే ఆలస్యం!



• కాజీపేట రైల్వే డివిజన్ హోదాకు మార్గం సుగమం
• ఏడాదిలో వ్యాగన్, మరో ఏడాదిలో కోచ్ ఫ్యాక్టరీలు
• మరిన్ని అభివృద్ధి పనులతో పూర్వ వైభవం

కాజీపేట, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : కాజీపేట జంక్షన్.. డివిజన్‌గా మారబోతోంది. అందుకు మార్గం సుగమమైందన్న సంకేతాలు వస్తున్నాయి. కాజీపేటకు వ్యాగన్ పీవోహెచ్, వ్యాగన్ తయారీ, కోచ్‌ఫ్యాక్టరీ ఏర్పాటు, బైపాస్ లైన్ నిర్మాణం, అమృత్‌భారత్‌లో భాగంగా కాజీపేట రైల్వే స్టేషన్‌ను ఎయిర్‌పోర్ట్ స్థాయిలో ఆధునికీకరించనున్నారు. అందుకు కావాల్సిన రోడ్డు రవాణా, నీటి సౌకర్యం, కావాల్సిన స్థలం సిద్ధంగా ఉంది. దక్షిణ మధ్య రైల్వేలోనే అత్యధిక ఆదాయం కాజీపేట జంక్షన్ నుంచే వస్తోంది. దీంతో డివిజన్ హోదా కల్పించక తప్పని పరిస్థితి. ఇన్ని అనుకూల అవకాశాలున్న కాజీపేట డివిజన్ హోదా ప్రకటించడమే ఆలస్యమనే చర్చ జరుగుతోంది. కాజీపేట రైల్వే డివిజన్ హోదా వస్తే రైల్వే పరంగా కాజీపేటలో డివిజన్ రైల్వే మేనేజర్ (డీఆర్‌ఎం) కార్యాలయాలతో పాటు ఇతర అన్ని ముఖ్యమైన కార్యాలయాలు ఇక్కడే నిర్మించాల్సిన పరిస్థితి. ఇక కాజీపేటకు మహర్దశేనన్న అభిప్రాయాలు వ్యక్తమవు తున్నాయి.

వచ్చే ఏడాది అందుబాటులోకి వ్యాగన్లు..

2013లో కాజీపేట మండలం మడికొండ సమీపంలోని అయోధ్యపురంలో 160 ఎకరాల్లో రూ.523 కోట్ల నిధులతో నాటి కేంద్ర రైల్వే శాఖ మంత్రి మమత బెనర్జీ రైల్వే పీవోహెచ్ మంజూరు చేశారు. తర్వాత వ్యాగన్ తయారీ పరిశ్రమగా అప్‌గ్రేడ్ చేశారు. కాలక్రమేణా ఆలస్యమైనా 2023లో ప్రధాని మోదీ రూ.66కోట్లు అదనపు నిధులతో సుబేదారి ఆర్ట్స్ కాలేజీలో వ్యాగన్ తయారీ పరిశ్రమను వర్చువల్‌గా ప్రారంభించారు. ఈ వ్యాగన్ తయారీ పరిశ్రమ 2025 ఆగస్టులో అందుబాటులోకి రానుంది. ప్రస్తుతం వ్యాగన్ తయారీ పరిశ్రమ నిర్మాణ పనులు చకచక సాగుతున్నాయి.

కోచ్‌ఫ్యాక్టరీ కూడా..

కాజీపేట వాసుల చిరకాల వాంఛ అయిన రైల్వే కోచ్‌ఫ్యాక్టరీ కాజీపేటకు మంజూరైంది. వ్యాగన్ తయారీ పరిశ్రమను అప్‌గ్రేడ్ చేస్తూ రూ.680కోట్లతో కోచ్‌ఫ్యాక్టరీ నిర్మిస్తామని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి ప్రకటించారు. అందుకుగాను రూ.66 కోట్ల నిధులు కూడా విడుదల చేస్తున్నట్లు చెప్పారు. దీంతో ఆర్‌వీఎన్‌ఎల్ సంస్థ స్థలం, నిధు లపై సర్వేచేసి రైల్వే బోర్డుకు సమర్పించారు. 1980 దశకం నుంచి డిమాండ్ ఉన్న కోచ్‌ఫ్యాక్టరీ సాధనకోసం తెలంగాణ రైల్వే జేఏసీ, మజ్దూర్ , ఎంప్లాయిస్ సంఘ్‌తో పాటు అన్ని రాజకీయ పార్టీలు ఎన్నో ఉద్యమాలు చేశాయి. ఎట్టకేలకు కేంద్రం కోచ్ ఫ్యాక్టరీ మంజూరు చేసింది. కోచ్‌ఫ్యాక్టరీ 2026 చివరి నెలలో అందుబాటులోకి రావడానికి రైల్వే అధికారులు అన్ని చర్యలు చేపట్టారు. ఇదిలా ఉండగా నష్కల్ నుంచి హసన్‌పర్తి, నష్కల్ నుంచి చింతలపల్లి మధ్య బైపాస్ లైన్ నిర్మాణం, ఎలక్ట్రిక్ పీవోహెచ్ షెడ్, హసన్‌పర్తి, వరంగల్ మధ్య మూడో లైన్ నిర్మాణంతో రైల్వే పరంగా కాజీపేట అభివృద్ధిని ఊహించలేమంటున్నారు విశ్లేషకులు. ఇన్ని అభివృద్ధి పనులు జరుతున్న దృష్ట్యా నిరుద్యోగులకు భారీగా ఉపాధి అవకాశాలు రానున్నాయి. ప్రత్య క్షంగా, పరోక్షంగా సుమారు 10 వేలమంది ఉపాధి అవకాశాలు లభించవచ్చని అంచ నా వెరసి రైల్వే కార్మికులో కాజీపేట రైల్వే కార్మికులతో కళకళలాడే రోజులు దగ్గర్లోనే ఉన్నాయి.

కాజీపేటకు పూర్వవైభవం

ఒకప్పుడు కాజీపేట నగరం రైల్వే కార్మికులతో కళకళలాడేది. కాజీపేట అంటేనే రైల్వే కార్మికుల కేంద్రం. అలాంటిది రోజురోజుకు రైల్వే కార్యాలయాల తరలింపు, ఉద్యోగుల బదిలీలతో కళతప్పింది. కాజీపేటలో రైల్వే పరిశ్రమలు నిర్మించాలని, దీంతో కార్మికులతో కాజీపేటకు పూర్వ వైభవం రావాలని ఉద్యోగ సంఘాలు, స్వచ్ఛంద సంస్థలు, అన్ని రాజకీయ పార్టీలు ఆందోళనలు చేశాయి. దీంతో కాజీపేటలో వ్యాగన్ పీవోహెచ్, వ్యాగన్ తయారీ, వందేభారత్ కోచ్‌లతోపాటు లింక్‌హాఫ్‌మన్ బుష్ (ఎల్‌హెచ్‌బీ), ఎలక్ట్రిక్ మల్టిబుల్ యూనిట్ (ఈఎంయూ) కోచ్‌లు తయారు చేసే కోచ్ ఫ్యాక్టరీ కాజీపేటలోనే తయారు కానున్నాయి. వెరసి కాజీపేట జంక్షన్ గతంకన్నా భిన్నంగా వేలాదిగా రైల్వే కార్మికులు, వారి కుటుంబాలు, విద్యాలయాలతో కాజీపేట జంక్షన్ కళకళలాడనుంది.

ఘనంగా 'జోడెద్దుల' ఉత్సవం

• ఉత్సాహంగా రెండో రోజు దీపావళి బతుకమ్మ వేడుకలు • కోలాటాల మధ్య కుంటకు తరలిన నేతకాని కులస్థులు • నేడు ముగియనున్న ఉత్సవాలు


జోడెద్దులకు ఆరగింపు చేస్తున్న నేతకాని కులస్తులు

హసన్‌పర్తి, నవంబర్ 2 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోనే వినూత్న రీతిలో మూడు రోజుల పాటు హసన్‌పర్తి మండలంలోని సీతంపేట నేతకాని కులస్థులు నిర్వహించే దీపావళి బతుకమ్మ వేడుకలు శుక్రవారం సంప్రదాయంబద్ధంగా ప్రారంభమైన విషయం తెలిసిందే. నేతకాని కులస్థులు కేదారీశ్వరస్వామి వ్రతం నిర్వహించుకొని జోడెద్దులకు పిండి వంటలతో తయారు చేసిన నగల (నాగళి, కోల, దుత్తలు, గొడుగు)తో ప్రత్యేకంగా అలంకరించారు. రెండో రోజు శనివారం పురుషుల ఘట్టంలో భాగంగా జోడెద్దుల ప్రతిమలను తీసుకొని కోలాటాలతో ఊరేగింపుగా ఊరు శివారులోని కుంటకు చేరుకున్నారు. అనంతరం కుంట వద్ద జోడెద్దుల ప్రతిమలకు కుల పెద్దలు ఆరగింపు చేసి పిండి వంటలతో చేసిన నగలను తీసి ఒకరికొకరు తినిపించుకొని వరుసైన వారితో (మగ వారు మాత్రమే) సరసాలాడి రంగులు చల్లుకొని జోడెద్దులను నిమజ్జనం చేశారు. ఈ వేడుకలకు తెలంగాణ నుంచే కాకుండా మహారాష్ట్ర, బొంబాయి లాంటి ఇతర రాష్ట్రాల్లో ఉద్యోగ రీత్యా స్థిరపడిన నేతకాని కులస్థులు తమ కుటుంబ సభ్యులతో హాజరయ్యారు. పురుషుల కోలాటాల నృత్యాలు, కోలాటం పాటలు గ్రామస్థులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ జనగాం శరత్‌కుమార్, మాజీ ఎంపీటీసీ బండారి రజితచేరాలు, కాంగ్రెస్ గ్రామ అధ్యక్షుడు జాడి రాజీవ్‌గాంధీ, నేతకాని కుల పెద్దలు, రాష్ట్ర, జిల్లా, మండల నాయకులు పాల్గొన్నారు. అయితే మూడు రోజుల పాటు నిర్వహించే ఈ వేడుకలు మూడో రోజైన ఆదివారం ముగియనున్నాయి. చివరిరోజున నేతకాని మహిళలు మాత్రమే జరుపుకొంటారు. తీరొక్క పూలతో పేర్చిన బతుకమ్మను కేదారీశ్వర స్వామి ఎదుట ప్రత్యేకంగా పూజిస్తారు. అనంతరం బతుకమ్మతో పాటు పసుపుతో చేసిన గౌరమ్మను, రకరకాల పిండి పదార్థాలను (సద్దిని) వెంట తీసుకొని ఊరేగింపుగా ఊరు శివారులోని చెరువు గట్టుకు చేరుకొని బతుకమ్మ ఆటపాటలతో సంబురాలు జరుపుకొంటారు. అనంతరం బతుకమ్మపై ఏర్పాటు చేసిన గౌరమ్మను వాయినంగా ఇచ్చి పుచ్చుకొని వారి వెంట తెచ్చుకున్న సద్దిని పంచుకొని ఒకరికొకరు తినిపించు కుంటారు. అనంతరం బతుకమ్మను చెరువులో నిమజ్జనం చేయడంతో మూడు రోజుల పాటు నిర్వహించే నేతకాని కులస్థుల దీపావళి బతుకమ్మ వేడుకలు ఆదివారంతో ముగియనున్నాయి.


ఊరేగింపుగా తరలివస్తున్న నేతకాని కులస్తులు

రక్షణకు పచ్చని పరదా..

» విరివిగా వినియోగిస్తున్న ప్రజలు
» పల్లెల్లో ఏ ఇంట చూసినా ఇవే..


గ్రీన్‌మ్యాట్‌తో ఇళ్లు ఏర్పాటు చేసిన దృశ్యం

పర్వతగిరి, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : ప్రస్తుతం నిర్మాణ వ్యయం భారీగా పెరిగిపోయింది. సామగ్రి మొదలు కూలీల వరకు అంతా భారమైంది. ఏ పనిచేయాలన్నా లక్షల్లో ఖర్చవుతోంది. ఈ క్రమంలో పచ్చని పరదాలు సామాన్యుల పాలిట రక్షణ కవచాలుగా మారాయి. చాలామంది తమ ఇళ్లకు ప్రహరీలుగా.. ఎండకు నీడనిచ్చే పైకప్పుగా.. చిన్నపాటి గదులను ఏర్పాటు చేసే గోడల్లా మారుతున్నాయి. అంతేకాదు చిన్నచిన్న షాపులు, హోటళ్లు ఏర్పాటు చేసుకునే చిరువ్యాపారులు కూడా వీటిని విరివిగా వినియోగిస్తున్నారు. వేలల్లో అయ్యే ఖర్చును కాస్త రూ.వందల్లోనే పూర్తిచేసుకుంటున్నారు. పట్టణాలు, పల్లెలు అనే తేడా లేకుండా సాధారణ ప్రజలు వీటిని వినియోగిస్తున్నారు. అయితే ఈ పరదాలు పలు సైజులు, నాణ్యతను బట్టి కిలో రూ.150 నుంచి రూ.200 వరకు ఉంటుండటం, ఆ ధరలు అందుబాటులో ఉండటం, మన్నిక కూడా ఉండటంతో ప్రజలు వీటివైపు ఆసక్తి చూపుతున్నారు.


గ్రీన్‌మ్యాట్‌తో ఏర్పాటుచేసిన ప్రహరీ

వర్గీకరణతో ఎస్సీలను విడదీయొద్దు

● మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు పిల్లి సుధాకర్

కురవి, నవంబరు2 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వర్గీకరణ పేరుతో ఎస్సీలను విడదీయవద్దని మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు పిల్లి సుధాకర్ విమర్శించారు. మాలల మహా పాదయాత్ర శనివారం కురవికి చేరుకుంది. ఈ సందర్భంగా పాదయాత్రకు మాలలు ఘనస్వాగతం పలికారు. అంబేడ్కర్ సెంటర్‌లో జరిగిన సభలో ఆయన మాట్లాడారు. మాల, మాదిగలను విడగొడుతున్న ప్రభుత్వాలకు బుద్ధి చెప్పాలని, రాజ్యాధికారమే అంతిమ లక్ష్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు. రాష్ట్రం లో మాలల జనాభా తక్కువ అని అశాస్త్రీయ లెక్కలు చూపిస్తూ ఒక వర్గం సమాజాన్ని తప్పుదోవ పట్టిస్తోందన్నారు. వర్గీకరణను రద్దుచేసే వరకు మాలమహానాడు పోరాటం కొనసాగుతుందన్నారు. కార్యక్రమంలో జాతీయ ప్రధాన కార్యదర్శి భైరి



మాట్లాడుతున్న పిల్లి సుధాకర్

రమేష్, జాతీయ కార్యదర్శి భాస్కర్, బెజ్జం ఐలయ్య, యాకాం బ్రం, కందుకూరి వెంకటాద్రి, బూర్గుల రమేష్, బొడ్డు రమేష్, మండల అధ్యక్షుడు కామిండ్ల వీరన్న, కలగూర నాగరాజు, కామిండ్ల ఆనందం, బూర్గుల ఉపేందర్, బేతమల్ల నారాయణ, మాల జర్నలిస్టులు బేతమల్ల సహదేవ్, కొప్పుల శ్రీనివాస్, గండమల్ల రోషయ్య, కమటం నాగేశ్వర్‌రావు పాల్గొన్నారు.

దేశంలోనే మొట్టమొదటి కుల గణన చేస్తున్న సీఎం

డోర్నకల్ ఎమ్మెల్యే రాంచంద్రునాయక్



మాట్లాడుతున్న రాంచంద్రునాయక్

మరిపెడ, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : దేశంలోనే మొట్టమొదటి దఫా కుల గణనను తెలంగాణ రాష్ట్రంలో అమలు చేస్తున్న ఏకైక సీఎంగా రేవంత్‌రెడ్డికే ఘనత దక్కిందని ప్రభుత్వవిప్, డోర్నకల్ ఎమ్మెల్యే జాటోత్ రాంచంద్రునాయక్ అన్నారు. శనివారం డోర్నకల్ నియోజకవర్గ స్థాయి కాంగ్రెస్ కార్యకర్తల సమావేశం మరిపెడ బంగ్లాలోని భార్గవ్ ఫంక్షన్ హాల్‌లో జరుగగా ఆయన, పాల్గొని మాట్లాడారు. జవహర్ లాల్ నెహ్రూ నుంచి రాహుల్‌గాంధీ వరకు దేశ అభ్యున్నతి కోసం కాంగ్రెస్ పార్టీ పాటుపడుతు న్నదని గుర్తు చేశారు. రాహుల్‌గాంధీ జోడో యాత్ర సందర్భంగా కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే కులగణన జరిపి బీసీలకు వారి జనాభా తమషా ప్రకారం రిజర్వేషన్లు కలిపిస్తామని ఇచ్చిన మాట మేరకు రేవంత్‌రెడ్డి ఈనెల 6 నుంచి రాష్ట్ర వ్యాప్తంగా కుల గణన జరిపిస్తున్నారన్నారు. దీనికి కాంగ్రెస్ శ్రేణులు ప్రభుత్వం రూపొందించిన ప్రశ్నావళిపై అవగాహన పొంది గ్రామాల్లోని ప్రజలను చైతన్య పర్చాలన్నారు. మానుకోట ఎమ్మెల్యే మురళీనా యక్, జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు జె.భరత్ చంద్రారెడ్డి, జిల్లా కాంగ్రెస్ నేత యుగేంధర్‌రెడ్డి, మరిపెడ మండల పార్టీ అధ్యక్షుడు రఘువీర్ రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు కమలాకర్ మాట్లాడారు. పట్టణ అధ్యక్షుడు తాజ్‌ద్దీన్, కేసముద్రం ఏఎంసీ వైస్ చైర్మన్ ఐలిమల్లు, కాలం రవీందర్‌రెడ్డి, అంబటి వీరభద్రం, అంబరీశ, గుగులోత్ రవి, అఫ్జల్, అప్సర్ పాల్గొన్నారు.

న్యూస్ బాక్స్

ఎరువుల దుకాణాలు తనిఖీ

నర్సింహులపేట, నవబంరు 2 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని పలు ఎరువుల దుకాణాలను ఏడీఏ విజయ్‌చందర్ శనివారం తనిఖీ చేశారు. స్టాక్ వివరాల రికార్డులు, బిల్లు బుక్కులు, ఈ పాస్ మిషన్‌లో స్టాక్, గోదాంలో నిల్వలను పరిశీలించారు. ఎరువుల స్టాక్ వివరాలు బోర్డుపై నమోదు చేయాలన్నారు. అధిక ధరలకు ఎరువులు, పురుగు మందులు విక్రయిస్తే చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. ఏవో వినయ్‌కుమార్, ఏఈవోలు ఉన్నారు.

ఇల్లందు మార్కెట్ కమిటీ డైరెక్టర్‌గా వెంకన్న



గార్ల, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : ఇల్లందు మార్కెట్ కమిటీ డైరెక్టర్‌గా శేరిపురానికి చెందిన కాంగ్రెస్ నాయకుడు జిగట వెంకన్న శనివారం నియమితులయ్యారు. గత మార్కెట్ పాలక మండలిలోనూ వెంకన్న సభ్యులుగా పనిచేశారు. కాగా, రెండోసారి ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య సూచనలు మేరకు మరోసారి డైరెక్టర్ నియమించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డైరెక్టర్ నియామకానికి కృషి చేసిన ఇల్లందు ఎమ్మెల్యే కనకయ్య, పీఏసీఎస్ చైర్మన్ వడ్లమూడి దుర్గాప్రసాద్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

'సైన్స్‌పట్ల ఆసక్తిని పెంచాలి'

కురవి, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థుల్లో సైంటిఫిక్ టెంపర్‌ను పెంపొందించాలని బలపాల జడ్పీహెచ్ఎస్ హెచ్ఎం నర్సింహారెడ్డి, కురవి మండల జన విజ్ఞాన వేదిక అధ్యక్షురాలు తేలుకుంట్ల సునీత అన్నారు. బలపాలలో శనివారం చెకుముఖి పోస్టర్లను ఆవిష్కరించారు. చెకుముఖి సైన్స్‌టాలెంట్‌టెస్ట్ పాఠశాల స్థాయిలో నవంబర్ 7న, జిల్లాస్థాయిలో నవంబర్ 14న, రాష్ట్రస్థాయిలో నవంబర్ 28న నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ టాలెంట్ టెస్ట్‌లో 8,9,10 తరగతుల విద్యార్థులు పాల్గొనాలన్నారు. మధుసూదన్‌రెడ్డి, టీవీబీ ప్రసాద్, గోపికృష్ణ, సీతారాములు, జయశ్రీ, మోతీలాల్, షకీరాబేగం, రాజేశ్వర్, మమత, వినోద్, రామారావు పాల్గొన్నారు.

7న చెకుముకి టాలెంట్ టెస్ట్ పోటీలు

గార్ల, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలో జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ఈనెల 7న జరిగే చెకుముకి టాలెంట్ టెస్ట్ పోటీలను విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొని, విజయవంతం చేయాలని ఎంఈవో మంకిడి వీరభద్రం అన్నారు. స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో ఈనెల 7న జరిగే చెకుముకి టాలెంట్ టెస్ట్ పోటీలగోడ ప్రతులను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో టీటీఎఫ్ రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు మాలోత్ శివనాయక్, ఎడ్ల అప్పయ్య, శీలంశెట్టి వెంకటేశ్వర్లు, జి.వీరన్న, మాచర్ల సుందర్ కుమార్ వీరస్వామి, రమేష్, బుచ్చయ్య, వీరు పాల్గొన్నారు.

'పీఆర్‌టీయూతోనే సమస్యలు పరిష్కారం'



నర్సింహులపేట హైస్కూల్‌లో ఉపాధ్యాయులతో పీఆర్‌టీయూ నాయకులు

నర్సింహులపేట, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : యువకుడు విద్యారంగ సమస్యల పట్ల పూర్తి అవగాహన కలిగిన పీఆర్‌టీయూ ఎమ్మెల్సీ అభ్యర్థి పింగిలి శ్రీపాల్‌రెడ్డి గెలుపు కోసం పీఆర్‌టీయూ మండల అధ్యక్షుడు పూర్ణ చందర్ ఆధ్వర్యంలో శనివారం మోడల్ స్కూల్, కేజీబీవి, నర్సింహులపేట, పెద్దనాగారం హైస్కూల్‌లల్లో ఉపాధ్యాయుల ఓటర్ నమోదు కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో సంఘం మండల ప్రధాన కార్యదర్శి కొండ సంజీవ, రాష్ట్ర బాధ్యుడు కె.ఎల్లారెడ్డి, వెన్నం వెంకట్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, నరేందర్, గౌస్, సుజాత ఉన్నారు.

టీచర్ల కోసం పీఆర్టీయూ పని చేస్తుంది

కేసముద్రం : ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారమే ప్రధాన లక్ష్యంగా దశాబ్ద కాలంగా పీఆర్టీయూ పనిచేస్తోందని సంఘం రాష్ట్ర అధ్యక్షుడు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి పింగిళి శ్రీపాల్‌రెడ్డి అన్నారు. కేసముద్రం మండలం కస్తూర్బాగాంధీ బాలికల, గిరిజన గురుకులాల్లో ఆయన ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతీ ఒక్క ఉపాధ్యాయుడు ఎమ్మెల్సీ ఓటరుగా నమోదు చేసుకోవాలని కోరారు. జిల్లా ప్రధాన కార్యదర్శి మిర్యాల సతీష్‌రెడ్డి, మండల అధ్యక్ష, కార్యదర్శులు గోపాల శ్రీధర్‌రెడ్డి, బీరం జనార్ధన్‌రెడ్డి, రాష్ట్ర బాధ్యులు రాపోలు యాకయ్య, వీరభద్రయ్య, బండారు నరేందర్, సురేష్‌నాయుడు, కోటకనకయ్య, పత్తి వీరస్వామి, హరికృష్ణ, శంకర్, హరినాథ్ పాల్గొన్నారు.

దోపిడీ, పీడనలేని సమసమాజం కోసం పోరాడుదాం

● సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ నాయకులు

మహబూబాబాద్ రూరల్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : దేశంలో దోపిడీ.. పీడనలేని సమసమాజ నిర్మాణం కోసం ప్రతీ ఒక్కరు పోరాడాలని సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జె.గోవర్ధన్, మండల వెంకన్న పిలుపునిచ్చారు. అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా కంబాలపల్లిలో శుక్రవారం రాత్రి జరిగిన బహిరంగ సభలో వారు మాట్లాడారు. భూమికోసం.. భుక్తి కోసం.. ఈ దేశ విముక్తి కోసం సాగుతున్న విప్లవోద్యమంలో అనేక మంది అమరులయ్యారని చెప్పారు. మానుకోట ప్రాంతంలో దొరలు, భూస్వాములకు వ్యతిరేకంగా పోరాటాలు నిర్వహిస్తూ ఈ ప్రాంతంలో వందలాది ఎకరాల పోడు భూములను పేదలకు పంపిణీ చేశారని చెప్పారు. పోలీసులు బూటకపు ఎన్‌కౌంటర్ల పేరుతో అనేక మంది విప్లవకారులను కాల్చి చంపారని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారెంటీలను అమలు చేస్తామని చెప్పి నేటికి ఏ ఒక్క హామీని కూడా పూర్తిస్థాయిలో అమలు చేయలేదని పేర్కొన్నారు. ఈ మహాసభలో జిల్లా కార్యదర్శులు గౌని ఐలయ్య, బండారు ఐలయ్య, హెచ్.లింగన్న, గుజ్జు దేవేందర్, సామ పాపయ్య, భట్టు భిన్నమ్మ, లక్ష్మయ్య, బోనగిరి మధు, చైతన్య, అశోక్, మహేష్, లింగన్న, మధు, జబ్బార్, వెంకట్‌రెడ్డి, సత్యం, యాకయ్య, విజయ్, కల్పన, రమ, అనిత, పద్మ, తిరుపతి, సోమ నర్సన్న, నాగరాజు పాల్గొన్నారు.

బీసీ కమిషన్ సమావేశానికి హాజరైన అదనపు కలెక్టర్

మహబూబాబాద్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : హన్మకొండ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో తెలంగాణ వెనుకబడిన తరగతుల కమిషన్ ఆధ్వర్యంలో రాష్ట్రంలో స్థానిక సంస్థల వారీగా కల్పించాల్సిన రిజర్వేషన్లను ఖరారు చేసే అంశంపై శనివారం నిర్వహించిన బహిరంగ విచారణ కార్యక్రమానికి మానుకోట జిల్లాఅదనపుకలెక్టర్ లెనిన్‌వత్సల్ టొప్పో హాజరయ్యారు. ఇందులో ఉమ్మడి వరంగల్ జిల్లాలోని మహబూబాబాద్, ములు గు, జయశంకర్ భూపాలపల్లి, జనగాం, హన్మకొండ, వరంగల్ జిల్లా ప్రజలు, బీసీ కులసంఘాల ప్రతినిధులు పాల్గొని తమ వినతులను అందించి అభిప్రాయాలను వెల్లడించారు.



హన్మకొండ కలెక్టర్ కార్యాలయంలో జరిగిన బీసీ కమిషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో పాల్గొన్న జిల్లా అదనపు కలెక్టర్ లెనిన్‌వత్సల్ టొప్పో

సీఎం, భట్టి చిత్రపటాలకు క్షీరాభిషేకం

గూడూరు, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : గిరిజన విద్యార్థులకు పౌష్టికాహారం అందించాలనే ఉద్దేశ్యంతో ప్రభుత్వం మెస్ చార్జీలను పెంచిందని దామరవంచ గిరిజన బాలుర గురుకుల జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ హేమంత్‌నాయక్ అన్నారు. పాఠశాలలో శనివారం సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క చిత్రపటాలకు టీచర్లు, అధ్యాపకులు, విద్యార్థులు క్షీరాభిషేకం చేశారు. చెప్పారు. వైస్ ప్రిన్సిపల్ రమేష్, డిప్యూటీ వార్డెన్ వనజ, రవికుమార్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ట్రెజరీ ఎంప్లాయి ఐడీ నంబర్లు ఇవ్వాలి

● పీఆర్టీయూ-టీఎస్ జిల్లా అధ్యక్షుడు బద్రినారాయణ

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : జిల్లా వ్యాప్తంగా ఇటీవల కొత్తగా విధుల్లో చేరిన ఉపాధ్యాయులకు ట్రెజరీ ఎంప్లాయి ఐడీ నంబర్లు ఇవ్వాలని పీఆర్టీయూ-టీఎస్ జిల్లా అధ్యక్షుడు బద్రినారాయణ అన్నారు. ఈ మేరకు మహబూబాబాద్‌లో శనివారం జిల్లా ఇన్చార్జీ ఖజానా అధికారి అరుణకు సంఘం ఆధ్వర్యంలో వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డీఎస్సీ-2024 ద్వారా జిల్లాలో 361 మంది ఉపాధ్యాయులుగా నియమించబడ్డారని, వారికి వేతనాలు చెల్లించాలంటే ఎంప్లాయి ఐడీ, ప్రాన్ నంబర్లు ఖజానా కార్యాలయం నుంచి ఇవ్వాల్సి ఉంటుందన్నారు. ఎస్టీవో కార్యాలయంలో ఎలాంటి జాప్యం లేకుండా ఉపాధ్యాయులకు ఎంప్లాయి ఐడీ నంబర్లు ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు మిర్యాల సతీష్‌రెడ్డి, కల్లెం వెంకట్‌రెడ్డి, భూక్య రామోజీనాయక్, కాపరబోయిన సుజాత, నాగరాజు, బాబురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'దాతలు ఆదుకోవడం అభినందనీయం'

తొర్రూరు, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : విద్యతో పాటు విద్యార్థులు క్రీడల్లో రాణించినట్లయితే జీవితంలో ఉన్నత స్థానాలను అధిరోహించవచ్చని ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి అన్నారు. శనివారం తొర్రూరులోని క్యాంపు కార్యాలయంలో నర్సింహులపేట మండలం పెద్దనాగారం గ్రామానికి చెందిన తేజశ్విని అనే విద్యార్థిని జాతీయస్థాయి కబడ్డీ క్రీడల్లో గతంలో అనేక మెడల్స్ సాధించారు. ఈనెల 6న జమ్మూకశ్మీర్‌లో జరిగే పోటీలకు ఎంపిక కాగా, ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో ఎమ్మెల్యే యశస్విని రెడ్డి తెలిపిన మేరకు వెన్నెల ఫౌండేషన్ నిర్వాహకులు విద్యార్థిని తేజశ్వినికి రూ.35వేల చెక్కును ఎమ్మెల్యే చేతుల మీదుగా తేజశ్వినికి అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చిన్నతనం నుంచే క్రీడల్లో రాణించాలని, తెలంగాణ ప్రభుత్వం క్రీడలను, క్రీడాకారులను అన్ని విధాలుగా ప్రోత్సహిస్తుందని తెలిపారు. ప్రతీ ఒక్కరు ఉన్నత స్థానాలను అధిరోహించాలన్నారు. వెన్నెల ఫౌండేషన్ నిర్వాహకులు చైతన్య ఉన్నారు.

మాదకద్రవ్యాల వినియోగం చట్టరీత్యా నేరం

డోర్నకల్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : మాదకద్రవ్యాల రవాణా, వినియోగం చేస్తే చట్టరీత్యా నేరమని ఎస్సై ఉమ అన్నారు. డోర్నకల్ జిల్లా పరిషత్ హైస్కూల్‌లో శనివారం నిర్వహించిన మాదక ద్రవ్యాల నిర్మూలన సదస్సులో ఆమె పాల్గొని మాట్లాడారు. విద్యార్థులు, యువత చెడు వ్యవసనాలకు దూరంగా ఉండాలన్నారు. ఎవరైనా మాదకద్రవ్యాల వినియోగం, రవాణా చేస్తే పోలీస్‌శాఖకు సమాచారం అందించాలన్నారు. సమాజాన్ని పట్టిపీడిస్తున్న మాదకద్రవ్యాలకు వ్యతిరేకంగా యువత ఉద్యమించాలన్నారు. అలాంటి వారికి పోలీస్‌శాఖ ఎళ్లవేళల అండగా ఉంటుందన్నారు. మాదకద్రవ్యాల వినియోగం వల్ల కలిగే అనర్థాలపై షార్ట్‌ఫిలీం ద్వారా విద్యార్థులకు అవగాహన కల్పించారు. అనంతరం విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించి పోస్టర్లను విడుదల చేశారు. జడ్పీ హైస్కూల్ హెచ్ఎం బండి నర్సింహారావు, ఉపాధ్యాయులు అప్పిరెడ్డి, శంకర్, శ్రీనివాస్, వసంతరాణి, అమీనా, సాహెబ్ అలీ, సమిత, బిచ్చానాయక్, శ్యామల, మాలతి పాల్గొన్నారు.

క్రైం కార్నర్

రూ.2.5 లక్షల విలువైన గంజాయి పట్టివేత

● ఒడిస్సాకు చెందిన వ్యక్తి అరెస్ట్

కేసముద్రం, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : ఒడిస్సా నుంచి గుజరాత్‌కు గంజాయి రవాణా చేస్తున్న వ్యక్తిని పట్టుకున్నట్లు మహబూబాబాద్ రూరల్ సీఐ పి.సర్వయ్య శనివారం తెలిపారు. సీఐ తెలిపిన ప్రకారం. ఒడిస్సా రాష్ట్రం గజపతి జిల్లా దుంగస్థల్ గ్రామానికి చెందిన కిషంత్‌నాయక్ శుక్రవారం ఒడిస్సా నుంచి నవజీవన్ ఎక్స్‌ప్రెస్‌లో గుజరాత్ రాష్ట్రం అహ్మదాబాద్‌కు గంజాయిని సంచుల్లో తీసుకువెళుతున్నాడు. రైలులో పోలీసుల తనిఖీలు ఉంటాయన్న భయంతో కిషంత్‌నాయక్ మహబూబాబాద్ రైల్వేస్టేషన్‌లో సంచులతో దిగి వరంగల్‌కు వెళ్లేందుకు ఒక వాహనంలో కేసముద్రానికి చేరాడు. ఇక్కడ ఉప్పరపల్లి క్రాస్‌రోడ్డు వద్ద రాత్రి అనుమానాస్పదంగా తిరుగుతున్నట్లు విశ్వసనీయ సమాచారం అందుకున్న స్థానిక ఎస్ఐ మురళీధర్‌రాజ్, పెట్రోలింగ్ పోలీసులు సదరు వ్యక్తిని పట్టుకున్నారు. అతని వద్ద నున్న సంచులను తనిఖీ చేయగా రూ.2.5లక్షల విలువైన 10 కిలోల ఎండు గంజాయిని గుర్తించడంతో వెంటనే అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు పంపించారు. ఇదిలా ఉండగా ఈ కేసులో ప్రతిభకనబర్చిన రూరల్ సీఐ సర్వయ్య, ఎస్ఐ మురళీధర్‌రాజ్, సిబ్బందిని జిల్లా ఎస్పీ సుధీర్‌రాంనాథ్ కేకన్ అభినందించారు.

పురుగుల మందుతాగిన వివాహిత మృతి

నర్సింహులపేట, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : చికిత్స పొందుతూ ఓ వివాహిత మహిళా మృతి చెందిన సంఘటన జయపురం దాసుతండాలో శనివారం జరిగింది. ఎస్సై మాలోతు సురేష్ తెలిపిన వివరాల ప్రకారం. దాసుతండాకు చెందిన గుగులోతు వెంక్యాతో నెల్లికుదురు మండలంలోని నాడ్యాతండకు చెందిన శిరీష (25)కు 2014లో వివాహమైంది. వీరికి ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. వెంక్యా భార్య శిరీషను కొంతకాలంగా అదనపు కట్నం కోసం వేధిస్తున్నాడు. భర్త వేధింపులు తాళలేక అక్టోబరు 12న పురుగుల మందు తాగడంతో కుటుంబసభ్యులు మహబూబాబాద్‌లోని ఓ ప్రైవేటు హాస్పటల్‌కు తరలించి చికిత్స అందిస్తున్నారు. పరిస్థితి విషమించి మృతి చెందింది. మృతురాలు తండ్రి బానోతు వెంకన్న ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

డోర్నకల్‌లో ఒకరి రిమాండ్

డోర్నకల్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : డోర్నకల్ మండలంలోని దుబ్బతండాలో గురువారం సాయంత్రం నూనావత్ వినోద్ అనే వ్యక్తిపై కత్తితో దాడి చేసిన నిందితుడిని శనివారం రిమాండ్‌కు తరలించినట్లు డోర్నకల్ సీఐ రాజేష్ తెలిపారు. సీఐ తెలిపిన వివరాల ప్రకారం. పాత కక్ష్యల మనస్సులో పెట్టుకున్న చాందావత్ సురేష్ అదే గ్రామానికి చెందిన వినోద్‌పై దాడి చేసినట్లు చెప్పారు. బాధితుడు వినోద్ భార్య సరిత ఇచ్చిన ఫిర్యాదు మేరకు సురేష్‌ను అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు.

జన విజ్ఞాన వేదిక సభ్యత్వ నమోదు

మరిపెడ, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : మరిపెడ మండలంలోని పలువురికి శనివారం జన విజ్ఞాన వేదిక మండల బాధ్యులు సభ్యత్వం అందచేశారు. తహసీల్దార్ సైదులు, మున్సిపల్ కమిషనర్ నరేశ్‌రెడ్డి, మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్, వివిధ పాఠశాలల హెచ్ఎంలు, టీచర్లు సభ్యత్వం తీసుకున్నారు. కార్యక్రమంలో ఆ సంఘ బాధ్యులు రాంమోహన్, జనార్ధనాచారి, సుభాన్, లాల్‌చంద్, మంగు, శ్రీశైలం, సమత, రాజకుమారి, స్వప్న పాల్గొన్నారు.

ప్రయాణీకులను అడ్డుకుంటున్న ఆర్టీసీ



తాడు కట్టి ప్రయాణీకులను అడ్డుకుంటున్న ఆర్టీసీ సిబ్బంది

తొర్రూరు, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : తొర్రూరు బస్టాండ్‌లోకి వస్తున్న ప్రయాణీకులను ఆర్టీసీ సిబ్బంది అడ్డుకోవడంతో పలువురు ప్రయాణీకులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఆర్టీసీ అధికారులు తొర్రూరు బస్టాండ్ ఆవరణలోకి ఇతర వాహనాలు రాకూడదనే నిబంధనతో అక్కడ ఆర్టీసీ సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారు. బస్టాండ్‌లోనికి ప్రైవేటు వాహనాలు రాకుండా తాడు కట్టి అడ్డుకోవడంతో లోపలికి వచ్చే ప్రయాణీకులు ఇదేమిటని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బస్టాండ్ ఆవరణలో బస్‌పాస్ కౌంటర్, కార్గో సెంటర్‌లు ఉన్నాయి. కొందరు వాటి పనులపై లోనికి వెళ్తుంటే ఆర్టీసీ సిబ్బంది ఇబ్బందులకు గురి చేస్తున్నారని, సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రయాణీకులు కోరుతున్నారు. దీనిపై ఆర్టీసీ అధికారులను వివరణ కోరగా తొర్రూరు బస్టాండ్ లోకి వెళ్లేందుకు ఇన్, ఔట్ గేట్‌లతో పాటు ప్రయాణీకులు వచ్చేందుకు దారి ఉందని, బస్టాండ్ లోపల వాహనాలు నిలపడంతో ప్రమాదాలకు గురవుతున్నారని, నడిచి వచ్చే ప్రయాణీకులను అడ్డుకోవద్దని సిబ్బందికి ఆదేశాలు జారీ చేస్తామన్నారు.

ఆరు గ్యారంటీల అమలులో కాంగ్రెస్ విఫలం

సీపీఎం జిల్లా కార్యదర్శి సాదుల శ్రీనివాస్

నర్సింహులపేట, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : ఆరు గ్యారంటీల పేరుతో అధికారం చేపట్టిన కాంగ్రెస్ హామీల అమలులో పూర్తిగా విఫలమైందని, హక్కుల సాధన కోసం ఐక్య పోరాటాలకు సిద్ధం కావల్సిన సమయం ఆసన్నమైందని సీపీఎం జిల్లా కార్యదర్శి సాదుల శ్రీనివాస్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని వెంకటేశ్వర గార్డెన్‌లో నర్సింహులపేట, చిన్నగూడూరు, దంతాలపల్లి మండలాల పరిధిలో జిల్లా కార్యవర్గ సభ్యుడు జి.మోహన్, సిఐటీయూ మండల అధ్యక్షుడు ఉస్మాన్ ఆధ్వర్యంలో ఏడో మహాసభలో ఆయన పాల్గొని మాట్లాడారు. సీఎం రేవంత్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన మాసం రోజుల్లోనే ఆరు గ్యారంటీలు అమలు చేస్తామని పూర్తిగా విఫలమయ్యారని విమర్శించారు. జిల్లా కార్యవర్గ సభ్యులు అలువాల వీరన్న, కొమ్మినేని రాజేశ్వర్, వీరన్న, రైతు కూలి సంఘం నాయకులు సోమిరెడ్డి, కేవీపీఎస్ జిల్లా నాయకులు మందుల యాకూబ్, సురేష్, స్వామి, పరుశరాములు, నరేష్ పాల్గొన్నారు.

అమరుల ఆశయ సాధనకై పోరాడుదాం

కొత్తగూడ, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : అమరుల ఆశయ సాధనకై పోరాడుదామని ఎన్డీ సబ్ డివిజన్ కమిటీ కార్యదర్శి శ్రీశైలం పిలుపునిచ్చారు. కొత్తగూడ మండలంలోని ముస్మీలో ఎన్డీ ఆధ్వర్యంలో అమరవీరులు గట్టి వీరభద్రయ్య, భూక్య అక్రు, బానోత్ రాజేందర్, జతేశ్వర్ సంస్మరణ సభ నిర్వహించారు. ఎర్రజెండాలు ఎగురవేశారు. నినాదాలు చేశారు, పాటలు పాడారు. కార్యక్రమంలో గట్టి సురేందర్, రాజమల్లు, నాగయ్య, పూర్ణచందర్, రామచంద్రు, జామ్లా, సతీష్ పాల్గొన్నారు.

అనాథ మహిళ మృతదేహానికి దహన సంస్కారాలు

కురవి, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : మండలం కేంద్రంలో రమ అనే అనాథ మహిళ అనారోగ్యంతో శనివారం మృతి చెందింది. గత కొన్నిరోజులుగా కురవిలో నివసిస్తూ సంత ఆవరణలో నివాసముంటుంది. ఈ విషయం తెలుసుకున్న యూట్యూబర్ రఘు, ఎస్సై సతీష్‌కు, కార్యదర్శి విజయలక్ష్మికి సమాచారం అందించారు. దీంతో గ్రామపంచాయతీ సిబ్బంది, పోలీసులు కలిసి రమ మృతదేహానికి దహనసంస్కారాలు జరిపించారు. ఏఎస్సై సదయ్య, యూట్యూబర్ గంగరబోయిన రఘు, పవన్, సంపత్, కల్యాణ్, శరత్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి క్రీడలకు కురవి ఆశ్రమ పాఠశాల విద్యార్థినులు

కురవి, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : కురవి గిరిజన ఆశ్రమ పాఠశాలకు చెందిన విద్యార్థినులు రాష్ట్రస్థాయి క్రీడలకు ఎంపికైనట్లు హెచ్ఎం బాబు, హెచ్‌డబ్ల్యూవో సునీత తెలిపారు. ఏటూరునాగారంలో అక్టోబరు 29,30తేదీల్లో జరిగిన అండర్ -17 కబడ్డీలో ప్రథమస్థానం, అండర్ -14లోద్వితీయ స్థానం సాధించారని తెలిపారు. కబడ్డీలో డి.నవ్య, బి.లావణ్య, అశ్విని, ఆర్చరీలో బి.దివ్య, బి.స్వప్న, అథ్లెటిక్స్‌లో డి.స్వప్న రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారని తెలిపారు. పీడీ సుశీల, పీఈటీ అనిల్‌కుమార్, ఉపాధ్యాయులు అమర్‌సింగ్, వెంకన్న, సీహెచ్. రవి, ధర్మా, శ్రీను, గోవర్ధన్, బాలరాజు పాల్గొన్నారు.

మైనార్టీ కళాశాల..

మహబూబాబాద్ ఎడ్యుకేషన్: జిల్లా కేంద్రంలోని మైనార్టీ గురుకుల జూనియర్ కళాశాల విద్యార్థులు రాష్ట్రస్థాయి క్రీడా పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ రహీమ్ తెలిపారు. స్థానిక కళాశాలలో విద్యార్థులు, ఫిజికల్ డైరెక్టర్ రవీందర్‌ను అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అక్టోబరు 25 నుంచి 29 వరకు హన్మకొండ జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో జరిగిన జిల్లా స్థాయిలో నిర్వహించిన హాకీ, ఖో-ఖో, హ్యాండ్‌బాల్, అథ్లెటిక్స్ పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచి 21 మంది విద్యార్థులు రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కో-ఆర్డినేటర్ జవహర్‌లాల్, అధ్యాపకులు శంకర్, రాజసుధ, కల్యాణలక్ష్మీ, నాగుల్‌మీరా, ప్రశాంత్, నాగరాజు పాల్గొన్నారు.

గూడూరు ఆశ్రమ పాఠశాల విద్యార్థినులు

గూడూరు, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : ఈనెల 29, 30 తేదీల్లో ఏటూరునాగారంలో జరిగిన వరంగల్, కరీంనగర్ ఉమ్మడి జిల్లాల ఆశ్రమ పాఠశాలల జిల్లాస్థాయి క్రీడల్లో గూడూరు బాలికల ఉన్నత పాఠశాలకు చెందిన నలుగురు విద్యార్థినులు ప్రతిభచాటి రాష్ట్రస్థాయి క్రీడలకుఎంపికైనట్లు పాఠశాల హెచ్ఎం డాక్టర్ కె.లలితకుమారి తెలిపారు. వాలీబాల్‌లో రష్మిత, కబడ్డీలో చైతన్య, 100 మీటర్ల పరుగుపందెంలో రష్మిత, షాట్‌పుట్‌లో హరిణిలు రాణించినట్లు చెప్పారు. రాష్ట్రస్థాయి క్రీడలకు ఎంపికైన విద్యార్థినులను ఉపాధ్యాయ బృందం అభినందించారు. ఈనెల 5 నుంచి 7 వరకు ఆదిలాబాద్ జిల్లా ఉట్నూరు ఐటీడీఏలో జరిగే రాష్ట్రస్థాయి క్రీడల్లో విద్యార్థినులు పాల్గొననున్నట్లు చెప్పారు. డిప్యూటీ వార్డెన్ ఎస్.దేవాదేవి, పీడీ లక్ష్మి, ఉపాధ్యాయులు ప్రసాద్, అమృత, శ్రీలత, ఉమారాణి, అనూరాధ, రమాదేవి, శ్రీను, వీరయ్య సత్యవతిపాల్గొన్నారు.

జాతీయస్థాయి తైక్వాండో పోటీలకు కోట కిరణ్

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, నవంబరు2 (ఆంధ్రజ్యోతి) : పంజాబ్ (అమృతసర్)లో జరగనున్న జాతీయస్థాయి తైక్వాండో పోటీలకు మహబూబాబాద్‌లోని నలంద డిగ్రీ కళాశాల విద్యార్థి కోట కిరణ్ ఎంపికైనట్లు కళాశాల కరస్పాండెంట్ డోలి సత్యనారాయణ శనివారం తెలిపారు. అక్టోబరులో వరంగల్ కాకతీయ యూనివర్సిటీలో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రతిభ కనబరిచి జాతీయ స్థాయికి ఎంపికైనట్లు తెలిపారు. కళాశాలలో బీఏ ప్రథమ సంవత్సరం చదువుతున్న విద్యార్థి కిరణ్ జాతీయస్థాయి పోటీలకు ఎంపిక కావడం పట్ల ప్రిన్సిపాల్స్ కృష్ణప్రసాద్, గట్ల శ్రీపాల్‌రెడ్డి, కోచ్ రమేష్, అధ్యాపకులు హర్షం వ్యక్తం చేశారు.

పొనుగోడు గ్రామాభివృద్ధికి సహకరించాలి

● విద్యావేత్త కోరె వెంకన్న



ప్రభుత్వవిప్ రాంచందర్‌నాయక్, మానుకోట ఎమ్మెల్యే మురళీనాయక్‌తో కోరె వెంకన్న

గూడూరు, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : పొనుగోడు గ్రామ అభివృద్ధికి ప్రభుత్వ విప్, డోర్నకల్ ఎమ్మెల్యే జాటోతు రాంచందర్‌నాయక్, స్థానిక ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు జెన్నారెడ్డి భరత్ చందర్‌రెడ్డి సహకరించాలని ప్రముఖ విద్యావేత్త కోరె వెంకన్న కోరారు. జిల్లా కేంద్రంలో శనివారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో వారిని మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించి, సన్మానించారు. ఈ సందర్భంగా వెంకన్న మాట్లాడుతూ పొనుగోడులో ప్రభుత్వ పాఠశాలను దత్తత తీసుకుని అభివృద్ధి చేసినట్లు పేర్కొన్నారు. కేవలం 17 మందితో ఉన్న పాఠశాలను 400 మంది విద్యార్థులు అడ్మిషన్లు పొందే విధంగా అభివృద్ధి చేసినట్లు చెప్పారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

తొర్రూరు రూరల్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : అనారోగ్యంతో మరణించిన పాఠశాల విద్యార్థిని కిన్నెర మమత కుటుంబానికి ఉపాధ్యాయులు ఆర్థిక సాయం చేశారు. అమ్మాపురం పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న పేద విద్యార్థిని మమత మరణించారు. కుటుంబ పరిస్థితుల తెలుసుకున్న పాఠశాల హెచ్ఎం తుమ్మ వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయ బృందం శనివారం రూ.5వేల ఆర్థిక సాయం అందజేశారు. ఉపాధ్యాయులు వీరన్న, సారయ్య, లక్ష్మయ్య ఉన్నారు.

మత్తు వినియోగానికి దూరంగా ఉండాలి

తొర్రూరు రూరల్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : యువత మత్తు వినియోగానికి దూరంగా ఉండాలని పాఠశాల హెచ్ఎం తండా ప్రభాకర్ అన్నారు. శనివారం మండలంలోని కంఠాయపాలెం ఉన్నత పాఠశాలలో డ్రగ్స్ వ్యతిరేక అవగాహన పోస్టర్ ఆవిష్కరించారు. హెచ్ఎం ప్రభాకర్ మాట్లాడుతూ యువత చెడుమార్గాలకు దూరంగా ఉంటూ బంగారు భవిష్యత్‌కు బాటలు వేసుకోవాలని సూచించారు. ప్రాణాంతకమైన డ్రగ్స్ నిర్మూలనకు ప్రతీ ఒక్కరు సహకరించాలన్నారు. యువత ప్రజల్లో చైతన్యం కలిపించాలని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల అధ్యాపక బృందం జనార్ధన్, సుధాకర్, అలీ, రహ్మాన్, నాగరాజు, నర్మద, శ్రీనివాస్, విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

వడ్ల కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాలి

(5వ పేజీ తరువాయి)

ధాన్యం కొనుగోలు కేంద్రాలను పూర్తిస్థాయిలో ప్రారంభించాలని, కేంద్రాల వద్ద ప్యాడీ క్లీనర్, ఇతర సామగ్రి యుద్ధ ప్రాతిపదికన ఏర్పాటు చేయాలన్నారు. రైస్ మిల్లర్ల వద్ద తాలుపేరుతో ధాన్యం కోతలు జరగవద్దని, నాణ్యత ప్రమాణాలు పరిశీలించిన తర్వాత కొనుగోలు చేయాలని, రైతుకు ఎలాంటి నష్టం రావడానికి వీల్లేదని చెప్పారు. రైతులు ఆరబెట్టిన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తీసుకురావాలని విజ్ఞప్తి చేశారు. రైస్‌మిల్లర్లతో సమావేశాన్ని నిర్వహించాలని, జీవో 27పై చర్చించాలని, మిల్లర్లకు బ్యాంకు గ్యారంటీ సమర్పిస్తామని అండర్ టెకింగ్ తీసుకుని ధాన్యం కేటాయింపు చేయవచ్చని అన్నారు. గతంలో ఎన్నడులేని విధంగా 48 గంటల్లో చెల్లింపులు పూర్తయ్యేలా చూడాలన్నారు. పక్క రాష్ట్రాల ధాన్యం మన కొనుగోలు కేంద్రాలకు రాకుండా సరిహద్దుల వద్ద చర్యలు తీసుకోవాలని ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సూచించారు.

జిల్లా కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్ మాట్లాడుతూ ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వులు 27పై రైస్ మిల్లర్లతో సమావేశాన్ని నిర్వహించామని చెప్పారు. ముందుగా రైస్‌మిల్లర్లు అండర్ టేకింగ్ సమర్పించి తర్వాత బ్యాంకు గ్యారంటీలు సమర్పించాలని సమాచారం అందించామని తెలిపారు. ధాన్యం కొనుగోళ్లు సమర్థవంతగా జరిగేలా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. ఈ వీసీలో జిల్లా అధికారులు కృష్ణవేణి, వెంకటేశ్వర్లు, వసంత, మరియన్న, విజయ్‌కుమార్, భద్రు నాయక్ పాల్గొన్నారు.